



కొత్త కలెక్టర్‌కు.. సవాళ్ల స్వాగతం!





- ఈ నెలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహణ
- పెండింగ్ ప్రాజెక్టులను పట్టాలెక్కించాలి
- నేడు కలెక్టర్‌గా పగ్గాలు చేపట్టనున్న డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్

పారిశ్రామికంగా.. పర్యాటకంగా.. అభివృద్ధికి ఎన్నో అనుకూలతలు.

అంతర్జాతీయ ప్రసిద్ధి చెందిన గ్రానైట్ రంగానికి కేంద్రంగా. వేలాది కుటుంబాలకు జీవనంతో పాటు అంతర్జాతీయ ద్రవ్యం సమకూర్చే ఆక్వారంగం. ఆంధ్రా గోవాగా ప్రసిద్ధి చెందిన సూర్యలంక తీరం.. ఇలా ఎన్నో ఎన్నెన్నో ఘనతలు ఉన్న బాపట్ల జిల్లా అభివృద్ధిలో వెనుకబడే ఉంది. నూతన జిల్లాగా ఆవిర్భవించి మూడేళ్లు దాటినా ఆశించినంత అభివృద్ధిలేదు. ఈ పరి స్థితుల్లో జిల్లాకు నూతన కలెక్టర్‌గా డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ నియమితులయ్యారు. డాక్టర్ అయిన కలెక్టర్ చికిత్స కోసం జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. సమస్యలతో పాటు అభివృద్ధి పనులు డాక్టర్ కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రధానంగా ప్రకృతి వనరుల దోపిడీపై కఠిన చర్యలకు ఉపక్రమించాల్సి ఉంది. పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ ఉపాధి కల్పనపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని సవాళ్లను అధిగమించడంతో పాటు జిల్లా ప్రగతిపై తనదైన ముద్ర వేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ శనివారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్ వేదికగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యంత్రాంగం పూర్తి చేసింది. ప్రస్తుత కలెక్టర్ వెంకట మురళిని బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడిన సంగతి తెలిసిందే. కొత్త కలెక్టర్‌గా పగ్గాలు అందుకోనున్న డాక్టర్ వినోద్‌కుమార్‌కు అనేక సవాళ్లు స్వాగతం పలకతున్నాయి. ముఖ్యంగా ఈ నెల చివరి వారంలో మూడు రోజుల పాటు సూర్యలంక తీరంలో జరగనున్న బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయడం తక్షణ సవాల్. ఈ కార్యక్రమం ద్వారా పర్యాటక రంగంలో పెట్టుబడులు ఆకర్షించాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. బీచ్ ఫెస్టివల్ కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడుతో పాటు, వివిధ రంగాల సెలబ్రిటీలు హాజరుకానున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా దీనిని విజయవంతం చేయాల్సిన బాధ్యత కలెక్టర్‌పైనే ఉంది.

- దిండిలో సమీకృత ఆక్వా పార్కు నిర్మాణం పెండింగ్‌లో ఉంది. ఇప్పటికే దీనికి రూ.86 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులను వేగవంతం చేయాలి.
- సూర్యలంక బీచ్ అభివృద్ధికి సంబంధించి రూ.97 కోట్లు నిధులు మంజూరు కాగా టెండర్ల ప్రక్రియ నడుస్తోంది. దీనిని పారదర్శకంగా చేయాల్సిన బాధ్యత నూతన సారథి పైనే ఉంది.
- గత ప్రభుత్వం పునాదులకే పరిమితం చేసిన బాపట్ల మెడికల్ కళాశాల పనులను పీపీపీ విధానంలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్దేశించిన గడువులోగా ఆ పనులు పూర్తి చేయాల్సి ఉంది.
- అద్దంకి పరిధిలో పారిశ్రామిక అవసరాలకోసం భూసేకరణకు ప్రభుత్వం ఇటీవలే నోటిఫికేషన్ ఇవ్వగా, భూసేకరణ అంశం క్లిష్టతరమైంది. దీనిని సజావుగా నడిపించాలి.
- అనేక బాలారిష్టాలను ఎదుర్కొంటోన్న గ్రానైట్ రంగాన్ని గాడిన పెట్టాలి. లీజు అగ్రిమెంట్లకు సంబంధించిన పరిశీలన ప్రస్తుతం జరుగుతోంది. ఒత్తిళ్లకు తలొగ్గకుండా దీనిని పూర్తి చేయాలి.
- ఉచిత ఇసుక పాలసీకి తూట్లు పొడిచే విధంగా అక్రమ రవాణా యథేచ్ఛగా జరగడం, రేషన్ మాఫియా ఆగడాలు, ఇలాంటి దందాలను కట్టడి చేయాల్సిన బాధ్యత నూతన కలెక్టర్‌పై ఉంది.

- జిల్లాలో వ్యవసాయం తర్వాత ఆక్వా రంగమే కీల కం. గత ప్రభుత్వ విధానాలతో ఈ రంగం పూర్తి గా సంక్షోభంలో కూరుకు పోయింది. జిల్లాలో దాదాపు 22,000 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా, దాదాపు 10,000 మంది ఉపాధి పొం దుతున్నారు. ఆక్వా రంగం తిరోగమన బాట పట్టకుండా, ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి.
- తక్షణమే పరిష్కారించాల్సిన సమస్యల్లో ముఖ్యంగా రైతులకు యూరి యా కొరత ఉంది. పంపిణీ లో అవకతవకలను నియంత్రించాల్సి ఉంది. బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి గోడౌన్ల సమస్య ఉంది.
- నల్లమడవాగు ఆధునికీకరణ దశాబ్దాల కల. భూసేకరణ కోసం రూ.180 కోట్లు విడుదలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. నల్లమడ వాగు ఆధునికీకరణకు భూసేకరణ చేయాలి.

పొగాకు మొత్తం కొనుగోలు చేస్తాం

- నల్ల, తెల్ల బర్లీ పొగాకు సాగు చేపట్టొద్దు
- రైతులతో మంత్రి రవికుమార్

పంగులూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్లకు నిల్వ సమస్య గుదిబండగా మారిందని, గోడౌన్లను గుర్తించి పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేపడతామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. గతకొద్ది రోజులుగా నిలిపివేసిన పొగాకు కొనుగోళ్లను కొనసాగించాలని శుక్రవారం రైతులు బూదవాడలో మంత్రిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నల్ల, తెల్లబర్లీ పొగాకు సాగు నిషేధించిందని, ప్రైవేట్ కంపెనీల మాటలు నమ్మి రైతులు సాగు చేపట్టవద్దన్నారు. ఇప్పటికే రెండేళ్లకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. కొనుగోలు చేసిన పొగాకు నిల్వ చేసేందుకు గోడౌన్లు లేక సతమతమవుతున్నట్లు తెలిపారు. పొగాకు సాగు చేపట్టకుండా రైతులు ప్రభుత్వానికి సహకరించాలన్నారు.

80శాతం కొనుగోలు చేశాం

రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకులో 80 శాతం కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ తెలిపారు. జిల్లాలో 51 కొనుగోలు కేంద్రాల ద్వారా 10,326 మంది రైతుల నుంచి 17 వేల టన్నుల బర్లీ పొగాకు కొనుగోలు చేశామన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన పొగాకుకు రైతుల ఖాతాలకు నగదు జమ అవుతున్నట్లు తెలిపారు. గుంటూరు పరిసరాలలో గోడౌన్లను గుర్తించామని సోమవారం నుంచి కొనుగోళ్లు తిరిగి ప్రారంభిస్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, తహసీల్దార్ సింగారావు, బయ్యర్ నరసింహారావు రమేష్, రామసుబ్బారావు, కె.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

గేదెల కొనుగోళ్లపై మంత్రికి వీవోఏల ఫిర్యాదు

అద్దంకి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇస్తున్న రుణం ద్వారా కొనుగోలు చేసే గేదెల విషయంలో అధికారులు ఒత్తిడి తెస్తున్నారని పలు మండలాల వీవోఏలు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. అద్దంకి, పర్చూరు నియోజకవర్గంలోని సుమారు 100 మందికి పైగా వీవోఏలు శుక్రవారం చిలకలూరిపేటలో మంత్రిని కలిసి అధికారుల ఒత్తిడి గురించి మొరపెట్టుకున్నారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలను కూడా మంత్రికి మహిళలు చూపిస్తూ జిల్లా అధికారుల అవినీతిపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడం లేదని కేవలం బ్యాంకుల ద్వారా రుణం ఇస్తుందని అయినా అధికారులు తాము చెప్పిన దగ్గరే గేదెలను కొనుగోలు చేయాలంటున్నారని మహిళలు మంత్రి ఎదుట వాపోయారు. స్థానికంగా తక్కువ ధరకు గేదెలను కొనుగోలు చేసుకునే అవకాశం ఉన్నా కృష్ణా జిల్లాలోని డెయిరీ ఫాంలోనే కొనుగోలు చేయాలంటున్నారన్నారు. మండలానికి సుమారు 500 గేదెలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. దీంతో మంత్రి వారి సమక్షంలోనే రాష్ట్ర అధికారుల దృష్టికి జిల్లా అధికారుల ఒత్తిడి విషయాన్ని తీసుకెళ్లారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

వణికిస్తున్న విష జ్వరాలు

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిట

కొల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొల్లూరుతో పాటు పలు గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వర పీడితులతో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలకు తాకిడి పెరిగింది. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో బాధితులు మంచం పడుతున్నారు. ఒకరోజు జ్వరం వచ్చి తగ్గినా వారం పది రోజుల పాటు వాంతులు, విరేచనాలు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. మొదట జలుబు సోకి ఆ తర్వాత జ్వరం వస్తుందని బాధితులు తెలిపారు. కొల్లూరు పీహెచ్‌సీలో పలువురు చికిత్స పొందుతున్నారు. మూడు నాలుగు రోజులకు కూడా జ్వరం తగ్గని వారు ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. శుక్రవారం కొల్లూరు పీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు అస్వస్థతకు గురికాగా ఆమెకు సిబ్బంది వైద్య సేవలు అందించాల్సి వచ్చింది. గ్రామాల్లో పారిశుధ్యం అడుగంటడంతో దోమలు, దుర్వాసనలతో అపరిశుభ్ర వాతావరణంలో జ్వరాలు విజృంభిస్తున్నాయని ప్రజలు తెలిపారు. బ్లీచింగ్ సున్నం, దోమల నివారణకు మందులు పిచికారీ చేయించి జ్వరాలు అదుపులోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జ్వర పీడితులకు ఇంజక్షన్లు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గ్రానైట్‌కు గడ్డుకాలం

- రోజు రోజుకు మూత దిశగా క్వారీలు, ఫ్యాక్టరీలు
- 50 శాతం పన్నులతో అమెరికాకు నిలిచిన ఎగుమతులు
- వచ్చే నెల నుంచి చెక్‌పోస్టులు.. సీనరేజ్ వసూళ్లకు రంగం సిద్ధం

బల్లికురవ మండలంలో ఉన్న స్టీల్ గ్రే కలర్ గ్రానైట్ క్వారీలు



బల్లికురవ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెరిగిన పెట్టుబడులు.. పెరిగిన ఉత్పత్తి.. ఇదే సమయంలో నిలిచిన ఎగుమతులతో గ్రానైట్ పరిశ్రమ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. గతంలో ఎంతో డిమాండ్ ఉన్న స్టీల్ గ్రే రకం రాయి అమ్మకాలు ప్రస్తుతం మందగించాయి. దీంతో క్వారీలు, ఫ్యాక్టరీలు మూత పడే పరిస్థితికి చేరాయి. ఇదే సమయంలో ప్రభుత్వం సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రైవేట్ సంస్థకు అప్పగించడంతో మరిన్ని పరిశ్రమల మూతపడక తప్పదని యజమానులు ఆందోళన చెందుతున్నారు. కొందరైతే నెలవారీ విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేక పోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోకపోతే పరిశ్రమల ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని నిర్వాహకులు వాపోతున్నారు. క్వారీలు, ఫ్యాక్టరీలపై ఆధారపడి జీవనం సాగించే 20 వేల కుటుంబాలు ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది. బల్లికురవకి సమీపంలోని వీర్లకొండలోని 20 క్వారీల నుంచి నాలుగు దశాబ్దాలుగా దేశవిదేశాల్లో డిమాండ్ ఉన్న స్టీల్ గ్రే ముడిరాయిని వెలికితీస్తున్నారు. ఇక్కడ నుంచి వచ్చే ముడిరాయి ద్వారా బల్లికురవ, మార్టూరు, సంతమాగులూరు తదితర ప్రాంతాల్లో



ఎగుమతులు లేక క్వారీలలో నిలిచిన ముడిరాయి బ్లాకులు

ఐదు వందల గ్రానైట్ ఫ్యాక్టరీల్లో పరుపు రాళ్లను కట్ చేస్తున్నారు. గ్రానైట్ రాళ్ల ఎగుమతులు నిలిచి పోవడంతో రెండు నెలల నుంచి ఈ క్వారీలు, ఫ్యాక్టరీలు గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ప్రధానంగా గ్యాంగ్‌సా రాయి అమెరికాకు అత్యధికంగా ఎగుమతి అయ్యేది. పెరిగిన పన్నుల ప్రభావంతో గతంలో ఒక అడుగు రాయికి పన్ను రూ.30 కాగా ఇప్పుడు రూ.150 చెల్లించాల్సి వస్తుందని అందుకే ఎవరూ కొనుగోలుకు ముందుకు రావడం లేదని వ్యాపారులు అంటున్నారు. దీనికి తోడు లోకల్‌గా ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలలో కటింగ్ చేసే స్లాబులు కూడా గతంలో రాజస్థాన్, బెంగళూరు. చెన్నై, మహరాష్ట్రల నుంచి ఆర్డర్లు తగ్గాయి. గతంలో అడుగు రాయి రూ.75కి కొనుగోలు చేస్తే ఇప్పుడు రూ.50కి బతిమిలాడి అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని యజమానులు వాపోతున్నారు. దీంతో క్వారీలను నిర్వహణ చేయలేమని కొందరు యజమానులు ఇప్పటికే మూతకు సిద్ధమవుతున్నారు. కార్మికులు ఉపాధి కోల్పోతారని, యంత్రాలు మరమ్మతులకు గురవుతాయని తప్పనిసరి పరిస్థితుల్లో మరికొందరు క్వారీలను, ఫ్యాక్టరీలను నడుపుతున్నారు. గత నెలలో రెండు వేల మీటర్ల ఉత్పత్తి చేసిన క్వారీ ఇప్పుడు వెయ్యి మీటర్ల రాయిని మాత్రమే వెలికితీస్తున్నది. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రానైట్ పరిశ్రమను కాపాడాలని కార్మికులు, యజమానులు కోరుతున్నారు.



నష్టాలతో ఉత్పత్తిని తగ్గించిన గ్రానైట్ ఫ్యాక్టరీ

సీనరేజ్ వసూళ్లపై బెంబేలు

గ్రానైట్ క్వారీలలో లభించే ముడి రాయి సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రైవేట్ సంస్థకు అప్పగించటంతో ముందు ముందు మరింత నష్టాలు తప్పవని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. వచ్చే నెల మొదటి వారం నుంచి చెక్‌పోస్టులు పెట్టేలా సీనరేజ్ వసూళ్ల టెండర్ వేసిన సంస్థ ఇప్పటికే ప్రణాళిక తయారు చేసింది. ఇప్పటి వరకు నాణ్యత తక్కువగా ఉన్న రాళ్లకు సీనరేజ్ చెల్లించకుండానే ఎగుమతులు చేశామని ఇప్పుడు వాటికి కూడా బిల్లులు పెడితే పరిశ్రమలు మూత పడక తప్పదంటున్నారు.

పరిశ్రమలకు ప్రోత్సాహం



గత ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని అంపశయ్యపైకి నెట్టగా కూటమి ప్రభుత్వం పట్టాలెక్కించేందుకు సిద్ధమైంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కొత్త పరిశ్రమల స్థాపనే లేకపోగా రాయితీల ఊసే దాదాపు మరచింది. కొవిడ్ విపత్తులో పరిశ్రమలకు అనేక రాయితీలను అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రకటించగా అమలు చేయలేదు. దీంతో జిల్లాలో గ్రానైట్ మొదలుకుని, ఆక్వా సంబంధిత రంగాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఓ దశలో జిల్లాలోని గ్రానైట్ వ్యాపారులంతా కూడా ఫ్యాక్టరీలకు తాళాలు వేసి నిరసన తెలిపిన ఉదం తాలు గత ప్రభుత్వంలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అప్పటి బకాయిలపై దృష్టి పెట్టి వాటి విడుద లకు అనుమతి ఇచ్చింది. జిల్లా వ్యాప్తం గా పెండింగ్ లో ఉన్న దాదాపు రూ.12 కోట్ల బకాయిలు విడు దలకు ఆమోదం తెలిపింది. దీంతో ఆయా పరిశ్రమల యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- పెండింగ్ రాయితీ రూ.12 కోట్లు విడుదల
- ప్రభుత్వ నిర్ణయంపై పారిశ్రామికవర్గాల హర్షం
- జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఊతం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలుగా దాదాపు 390 వరకు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దాదాపు 80,000 మంది వరకు వీటి ద్వారా ఉపాధి పొందుతున్నారు. పారిశ్రామిక వర్గాలకు భరోసా కల్పించాలంటే ముందుగా ప్రోత్సాహకాల రూపంలో పెండింగ్ బకాయిలను విడుదల చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. ఇందులో భాగంగానే రూ.12 కోట్లు విడుదలకు పచ్చజెండా ఊపింది. రాయితీల విడుదలతో చిన్నతరహా పరిశ్రమలకు ఊపిరి ఇచ్చినట్లే. ఒక్కో పరిశ్రమకు లక్ష నుంచి ఐదు లక్షల వరకు బకాయిలు అందనున్నాయి

చేదు గుర్తులను చెరిపేయాలి..

పరిశ్రమల యజమానులను వైసీపీ ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేసిన సంగతి తెలిసిందే. జే ట్యాక్స్ పేరుతో స్థానిక నేతలు సాగించిన ముడుపుల పర్వాలయితే పరిశ్రమల నిర్వాహకులను బెంబేలెత్తించాయి. ప్రభుత్వం ఆ చేదు గుర్తులను చెరిపేసి పరిశ్రమలకు కొత్త ఊపిరూలా దాలనే నిర్ణయంతో ముందుకెళుతోంది. రాయితీ నగదు కోసం ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న పరిశ్రమల సంఖ్య దాదాపు 550 వరకు ఉన్నట్లు సమాచారం. అనేక దశల వడపోత అనంతరం ప్రభుత్వం వీటి సంఖ్యను 390గా తేల్చి తొలి దశలో భాగంగా ప్రోత్సాహకాల బకాయిలను విడుదల చేసింది. నిబంధనల ప్రకారం పరిశ్రమలు స్థాపించదలచుకున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా కల్పించడంతో పాటు, పారిశ్రామికవర్గాలకు ఫ్రెండ్లీ ప్రభుత్వం అనే సంకేతాలను పంపాలనేదే పాలకుల ఉద్దేశ్యంగా ఉంది. జిల్లాలో పరిశ్రమల ద్వారా ఉపాధి పొందే వారి సంఖ్యను రాబోయే రెండేళ్లలో నాలుగు లక్షల వరకు తీసు కెళ్లాలనేది ప్రభుత్వ ఆలో చనగా ఉంది. దానిలో భాగంగానే పరిశ్రమలకు రాయితీల విషయంలో ప్రభుత్వం ఆచి తూచి అడుగులేస్తోంది.

పర్యాటకంపై పలువురి ఆసక్తి...

జిల్లాలో ఇప్పటి వరకు పరిశ్రమలు అంటే ముందుగా గుర్తొచ్చేది గ్రానైట్‌తో పాటు ఆక్వా రంగాలే. కానీ ప్రభుత్వం పర్యాటకంపై ప్రత్యేక దృష్టి సారించి అడుగులేస్తుండడంతో పరిశ్రమ వర్గాలు తీరప్రాంతంలో ఉన్న అవకాశాలపై ఆసక్తి కనబరుస్తున్నాయి. తీరప్రాంతంలో పరిశ్రమల స్థాపనకుగాని, స్టార్ హోటల్స్‌ను తలదన్నేలా రిసార్టులు నిర్మించాలన్నా పర్యావరణ సమతుల్యత కాపాడాల్సిన అవసరంతో పాటు కోస్టల్ రెగ్యులేటరీ అథారిటీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.



నైపుణ్యంతోనే సమస్యలకు సరైన పరిష్కారం

- పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ కమిషనర్ ముత్యాలరాజు



మాట్లాడుతున్న ముత్యాలరాజు

బాపట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలు పెంపొందించుకుంటే సమస్యలకు సరైన పరిష్కారం అందించవచ్చని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ కమిషనర్ రేవు ముత్యాలరాజు తెలిపారు. బాపట్ల విస్తరణా శిక్షణా కేంద్రంలో ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలకు జరుగుతున్న శిక్షణా తరగతులను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు క్రమశిక్షణ, నైపుణ్యాలతో పనిచేస్తూ క్షేత్ర స్థాయిలో సమస్యలకు పరిష్కారం కనుకుని విధి నిర్వహణలో సంతృప్తి పొందాలన్నారు. విధులు నిర్వర్తించే ప్రతిదశలోను సవాళ్లు ఎదురౌతాయని వాటిని సమర్థంగా ఎదుర్కొని పరిష్కరించాలన్నారు. విస్తరణా శిక్షణా కేంద్రం నిర్వాహణ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ జీఎస్ డబ్ల్యుఎస్, వైద్య, విద్య, ఇంజనీరింగ్ తదితర విభాగాల శిక్షణ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ డి.వెంకట్రావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వరప్రసాద్, గుంటూరు జడ్పీ సీఈవో జ్యోతిబసు, పల్నాడు డీపీవో నాగేశ్వరనాయక్, డీఆర్‌డీఏ పీడీ. కె.శ్రీనివాసరావు, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మజ, డీడీవో సి.హెచ్.వి జయలక్ష్మి, డ్వామా ఏపీడీ బి.సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువులను ఢీకొన్న రాయగడ ఎక్స్‌ప్రెస్

● మార్గ మధ్యలో నిలిపేసిన ఫలక్‌నుమా రైలు

గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం వేకువజామున పశువులను ఢీ కొని మొరాయించింది. మంగళగిరి - నంబూరు సెక్షన్‌లో ఈ ఘటన జరిగింది. దీంతో లోకో స్వల్పంగా మరమ్మతులకు గురికాగా అధికారులు తాత్కాలిక రిపేర్లు నిర్వహించి పంపించారు. సుమారు గంట పాటు రైలు నిలిచిపోయింది. హౌరా నుంచి వస్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌ని 50 నిమిషాల పాటు మంగళగిరి వద్ద నిలిపేయాల్సి వచ్చింది.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల నిరసన

● తహసీల్దారు కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేత



పశ్చిమ తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు (విద్య) సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యా యులకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకా యిల విడుదల కోరుతూ ఏపీటీఎఫ్ తలపెట్టిన నిరస న కొనసాగుతోంది. శుక్రవా రం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తహసీల్దారు కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శన చేసి తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా ఏపీటీఎఫ్ సంఘంతో చర్చలు జరిపి పెండింగ్ ఆర్థిక బకాయిలు విడుదల పై రోడ్ మ్యాప్ షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా శాఖ కార్యదర్శి సత్యనారాయణమూర్తి, పి.శివరామకృష్ణ, మునినాయిక్, చంద్రశేఖర్, అంకారావు,వేణుగోపాలరావు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ప్రాంగణ ఎంపికలు



ప్రతిభ నిర్ధారణ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

ఏఎన్‌యూ సెప్టెంబర్, 12(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని ఎమ్మెస్సీ (బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ)విద్యార్థులకు శుక్రవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌లో డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీ సంస్థ నిర్వాహకులు ఆన్‌లైన్ ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఇంజనీరింగ్, సైన్స్ కళాశాలల ప్రాంగణ నియామకాల అధికారులు డాక్టర్ తౌసిఫ్ అహమ్మద్, డాక్టర్ సూర్య కామేశ్వరి విద్యార్థులను సమన్వయపరిచారు. డాక్టర్ రెడ్డీస్ హెచ్‌ఆర్ వైష్ణవి, గ్రేస్ ఆమోర్ నిర్వహించిన ఇంటర్వ్యూకు 62 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంపిక చేసిన విద్యార్థులకు ఈ నెల 16, 17 తేదీల్లో ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు.

దమ్ముంటే చర్చకు రా.. పిన్నెల్లి!

● నీ తండ్రి ఎరువుల కుంభకోణంపై చర్చకు సిద్ధమా..?
● త్వరలో వరికపూడిశెల నిర్మాణానికి శంకుస్థాపన
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దమ్ముంటే చర్చకు రావాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం పట్టణంలోని కేసీపీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎరువుల కొరత ఉందని కృత్రిమ పోరాటం చేస్తూ వైసీపీ రైతులను తప్పుదోవ పట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని సొసైటీలు, మార్కెట్ యార్డు, మార్క్‌ఫెడ్, గ్రోమోరు సెంటర్లలో వందల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మించకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న పిన్నెల్లి నేడు రైతుల కోసం మొసలి కన్నీరు కార్చడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని సమర్థంగా అమలు చేసి రైతు బాంధవునిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలిచారని తెలిపారు.

ఎరువుల కుంభకోణంపై చర్చకు సిద్ధమా..?

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకొని పిన్నెల్లి తండ్రి వెంకటేశ్వరరెడ్డి, పిన్నెల్లి హనిమిరెడ్డి పాల్పడ్డ ఎరువుల కుంభకోణం, యూరియా కుంభకోణంపై చర్చకు సిద్ధమా అంటూ ఎమ్మెల్యే జూలకంటి నిలదీశారు. వేల మెట్రిక్ టన్నుల యూరియా ఎరువులు బ్లాక్ మార్కెట్ మార్కెట్‌లో అమ్ముకున్న లెక్కలు అవినీతి పై త్వరలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో రైతులను అన్ని విధాలుగా నాశనం చేసి ఇప్పుడు కృత్రిమ పోరాటాలు చేస్తున్నారని ఆరోపించారు. మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలంలో వరికపూడిశెల ప్రాజెక్ట్ లిఫ్ట్ నిర్మాణ పనులకు వచ్చే అసెంబ్లీ సమావేశాలు అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందని, శంకుస్థాపన తేదీని కూడా ప్రకటిస్తామని ఎమ్మెల్యే జూలకంటి ఈం సందర్భంగా తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ఆశయ సాధన కోసం తీవ్రంగా శ్రమించిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్‌యార్డు ఛైర్ పర్సన్ మల్లీశ్వరి మధుసూదన్ యాదవ్, వైస్ చైర్మన్ గుండాల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మద్దిగపు చిన వెంకట్రామిరెడ్డి, కృష్ణవేణి, మంజుల పెద్ద అంజి, గోగుల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎడ్ సెట్, లా సెట్ ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఏఎన్‌యూ, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఎడ్ సెట్-2025), లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ లా సెట్-2025)కు దరఖాస్తు చేసుకున్న ప్రత్యేక కేటగిరి అభ్యర్థులకు ఏఎన్‌యూలోని ఆన్‌లైన్ కౌన్సిలింగ్ కేంద్రంలో శుక్రవారం విద్యార్హత సర్టిఫికెట్లు పరిశీలన చేసినట్లు కేంద్రం సమన్వయకర్త ఆచార్య పి.బ్రహ్మాజీరావు, ఎడ్ సెట్ కన్వీనర్ ఆచార్య స్వామి, లా సెట్ కన్వీనర్ ఆచార్య సీతాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్ సెట్‌కు సంబంధించి ఎన్‌సీసీ కేటగిరి నుంచి 27, క్యాప్ నుంచి ఐదుగురు, క్రీడల నుంచి ఐదుగురు, లా సెట్‌కు ఎన్‌సీసీ నుంచి 158, క్యాప్ నుంచి 10, క్రీడల నుంచి 34 మంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరి నుంచి ముగ్గురు అభ్యర్థులు హాజరయ్యారని చెప్పారు. పీహెచ్ కేటగిరి అభ్యర్థులకు తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగికి నగదు వితరణ

ఏఎన్‌యూ స్వర్ణోత్సవాల సందర్భంగా వర్సిటీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఒగ్గు నాగేశ్వరరావుకు రూ. 50 వేల చెక్కును వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్న షీలామణి అందజేశారు. నాగేశ్వరరావు ప్రస్తుతం పెన్షనర్ల సంఘం కోశాధికారిగా ఉన్నారు. పెన్షనర్ల సంఘం, సహచర ఉద్యోగులు వితరణ పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాగేశ్వరరావుకు నగదు చెక్కు అందజేస్తున్న వీసీ, రెక్టార్

పీజీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

వర్సిటీ పరిధిలో జూలైలో జరిగిన పీజీ కోర్సుల రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు శుక్రవారం విడుదల చేశారు. ఎంఎస్సీ బయోటెక్నాలజీలో నూరుశాతం, సాయిల్ సైన్స్ అండ్ అగ్రి కల్చరల్ కెమిస్ట్రీలో 12, సైకాలజీలో 21, ఫోరెన్సిక్ సైన్సెస్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. రీవాల్యూయేషన్‌కు ఈ నెల 22లోగా పేపరుకు రూ.1,860 చెల్లించి పరీక్షల కోఆర్డినేటర్‌కు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష ఫలితాలు ఏఎన్‌యూ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అమరావతిలో పర్యావరణ, సామాజిక రక్షణపై సంతృప్తి

● ముగిసిన వరల్డ్ బ్యాంకు, ఏడీబీ బృందం పర్యటన

తుళ్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో పర్యావరణ, సామాజిక రక్షణ కార్యకలాపాలపై వరల్డ్ బ్యాంకు, ఏషియన్ డెలప్‌మెంట్ బ్యాంకుల బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. రెండు రోజుల పాటు ఈ బృందం అమరావతిలో చేపట్టిన పర్యటన శుక్రవారంతో ముగిసింది. అమరావతిలో నిర్మాణ పనులు చేపట్టిన ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీల ప్రతినిధులు తమ క్యాంపు సైట్‌లలో అమలు చేస్తున్న పర్యావరణ, సామాజిక రక్షణ కార్యకలాపాలను, కార్మికుల భద్రత విధానాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమం తుళ్ళూరులోని హెచ్‌ఎస్‌ఆర్ కల్యాణ వేదికలో జరిగింది. ఈ సందర్భంగా బృందం పలు సూచనలు చేసింది. అమరావతిలో లింగ వివక్షకు, బాల కార్మికులకు తావులేకుండా.. సీఆర్డీఏ అధికారుల సూచనల మేరకు నిర్మాణ పనులు చేపట్టినట్లు గుత్తేదారు సంస్థల ప్రతినిధులు వివరించారు. తుళ్ళూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులో విజయవంతంగా అమలు చేసిన భూ సమీకరణ విధానం(ల్యాండు పూలింగ్), అలాగే నెగోషియేటెడ్ సెటిల్ మెంట్ పాలసీ భూ సేకరణ(ఎల్‌పి)విధానాల గురించి.. సీఆర్డీఏ అధికారులు బృందానికి వివరించారు. రాజధాని అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన సోషల్ ఆడిట్ ప్రక్రియ, సిటిజన్ అడ్వైజరీ గ్రూప్ నుంచి వచ్చిన సలహాలను వివరించారు. రాజధాని రైతులు, రైతు కూలీల సమస్యలను పరిష్కరించేందుకు అర్జీలు స్వీకరించి ఆయా అర్జీల పరిష్కారానికి సమగ్రంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం గురించి తెలియజేయగా.. బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.



బృంద సభ్యులకు అమరావతిలో తీసుకుంటున్న రక్షణ చర్యలను వివరిస్తున్న గుత్తేదారు సంస్థల ప్రతినిధులు

నిధి భవన్‌లో కాంట్రాక్టర్ల నిరసన

మంగళగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరి ఆటోనగర్‌లోని నిధి భవన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 200 మంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. అనంతరం సమస్యలపై నిధి భవన్ సీఈవో గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. విజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పది రోజుల వరకు మాత్రమే బిల్లులు పోర్టల్‌మో నమోదు చేస్తారనే అపోహలో ఉన్నారని, అది నిజం కాదన్నారు. 30 రోజుల వరకు పోర్టల్స్‌లో బిల్లులు నమోదు చేస్తామని అధికారులు చెప్పారని, ఈ విషయాన్ని కాంట్రాక్టర్లందరూ గమనించాలని సూచించారు. నిధి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలను సరిచేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో బిల్లులు రాక దాదాపు 40 మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా పరిస్థితిలో మార్పు రాలేదని తెలిపారు. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను సీఎఫ్ఎంఎస్ నుంచి డీలింక్ చేసి నిధి పోర్టల్‌లో ఉంచడంతో కాంట్రాక్టర్ల కష్టాలు రెట్టింపు అయ్యాయని చెప్పారు. మునిసిపాలిటీల్లో అధికారులు పీవో విధానం పాటించకుండా బిల్లులు అప్‌లోడ్ చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సహాయ కార్యదర్శి కొండా రమేష్, కోశాధికారి అప్పారావు, వివిధ జిల్లాల అధ్యక్షులు కే.వెంకట్రావు, మండవ సాయి, రాంబాబు, శాంతారావు పాల్గొన్నారు.



నిధి భవన్‌లో బైఠాయించిన కాంట్రాక్టర్లు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559


బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 145, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ

ఏపీ అధ్యక్షుడిగా భగవన్నారాయణ



దేవతి భగవన్నారాయణ

మంగళగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఏపీ అధ్యక్షుడిగా మంగళగిరికి చెందిన దేవతి భగవన్నారాయణ నిమితులయ్యారు. ఈ మేరకు మద్రాసులోని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ముఖ్య కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో దేవతి భగవన్నారాయణను నియమిస్తూ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ నియామక పత్రాన్ని అందజేశారు. మహాసభ కన్వీనర్ యెల్లూరు లక్ష్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సుధాకర్ తదితరులు భగవన్నారాయణకు అభినందనలు తెలిపారు. భగవన్నారాయణ నియామకం పట్ల మంగళగిరికి చెందిన పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

31,890 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 31,890 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 36,734 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,208 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	14500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13500	334	10500	14400
273	10500	13500	నెంబరు. 5	10000	13600
341	10000	15000	273	---	---
4884	----	---	341	11000	15600
సూపర్ 10	---	----	4884	10000	14200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	16200
బ్యాడిగి	10000	16000	దేవనూరు డీలక్స్	10500	14500
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7700

తండ్రికి తీసిపోని లోకేశ్ పనితీరు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): నేపాల్ హింసాకాండలో చిక్కుకున్న తెలుగువారిని కాపాడటంలో యువ నేత, మంత్రి నారా లోకేశ్ చూపిన చొరవ, ముందు చూపుతో ఆయన వ్యవహరించిన తీరు నిజమైన నాయకత్వ లక్షణానికి ప్రతీక అని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు ఉత్తరాఖండ్‌లో చిక్కుకున్న తెలుగువారిని రాష్ట్రానికి తరలించే వరకు అవిశ్రాంతంగా పనిచేశారని గుర్తుచేశారు. చంద్రబాబు మార్గదర్శకత్వంలో అటు పార్టీని, ఇటు ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్న లోకేశ్ పనితీరు, పట్టుదలలో తండ్రికి తీసిపోనని నిరూపించుకున్నారని పేర్కొన్నారు. 200 పైగా తెలుగు వారితో నేరుగా మాట్లాడి, వారికి లోకేశ్ ధైర్యాన్నిచ్చారని తెలిపారు. తెలుగు వారిని సురక్షితంగా స్వస్థలాలకు తరలించడంలో లోకేశ్ నిజంగా విజయం సాధించారని ప్రశంసించారు.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారం.. వ్యక్తి అరెస్టు

దాచేపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల గురించి తప్పుడు పోస్టులను పెట్టిన వ్యక్తిపై కళాశాల ప్రిన్సిపల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోషల్ మీడియా నిర్వాహకుడిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. దాచేపల్లిలోని బాలుర హాస్టల్‌లో తోటి విద్యార్థిపై స్నేహితులు తీవ్రంగా దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఘటనపై వినుకొండకు చెందిన అబ్బూరి శ్రీనివాసరావు అనే సోషల్ మీడియా నిర్వాహకుడు దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఘటన జరిగినట్టు ప్రచారం చేశారు. తమకు సంబంధంలేని విషయాలపై తప్పుడు ప్రచారం చేశారని కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరరావు ఫిర్యాదు చేశారు. సీఐ భాస్కరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేకం..ఆ అధికారి తీరు!

● ఎమ్మెల్యేకు ఫిర్యాదు

రాజుపాలెం,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి తీరుపై స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీవల్లి, తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. విద్యార్థులతో పాఠశాల ప్రత్యేక అధికారి జ్యోతిర్మయి వ్యవహరిస్తున్న విధానం సరిగా లేదని ఆరోపిస్తున్నారు. విద్యార్థినులను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, కులమత బేధాలు చూపిస్తున్నారని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా హిందువుల పండగలకు సెలవులు ఉన్నా.. ఇళ్లకు విద్యార్థినులను పంపించడం లేదని ఆరోపించారు. వినాయక చవితికి పిల్లలను పంపమని పాఠశాల గేటు వద్దకు చేరిన తల్లిదండ్రులను, చైర్మన్‌ను వర్షం పడుతున్నా.. కనీసం గేటు తీయించలేదని పేర్కొన్నారు. పాఠశాలలో మరమ్మతులు జరిపి చైర్మన్‌కు తెలియకుండా ఎక్కువ మొత్తంలో డబ్బులు డ్రా చేస్తున్నారని ఆరోపించారు. భోజనంలో కూడా ఇద్దరికి కలిపి ఒక కోడిగుడ్డు వేస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

ఆటో డ్రైవర్‌కు 16 నెలల జైలు

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు సత్తెనపల్లి రెండవ అదనపు కోర్టు జడ్జి జె.సుజిన్ కుమార్ మూడు సెక్షన్‌లకు సంబంధించి శుక్రవారం 16 నెలల జైలు, రూ.11వేల అపరాధ రుసుం విధించారని అమరావతి ఎస్‌హెచ్‌ఓ అచ్చియ్య తెలిపారు. మండల పరిధిలోని మల్లాది వద్ద 2017లో జూపూడి నుంచి మల్లాది వైపు ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్తుండగా వెనుక నుంచి రుద్రమాల జేసు తన ఆటోతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జెట్టి నాగేంద్రం, మెరుగుమల చెన్నమ్మ మృతి చెందారు. అప్పటి ఎస్ఐ బి.నరసింహారావు కేసు నమోదు చేశారు. బాధితుల తరుపున ఏపీపీ ప్రసాద్ నాయక్ వాదనలు వినిపించారు.

స్కూల్ బస్సు ఢీకొని న్యాయవాది మృతి



బైక్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ స్కూల్ బస్సు, మృతుడు జనార్దనరావు

బాపట్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురు వన్ వే రోడ్డుపై శుక్రవారం ఉదయం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు బైకును ఢీకొట్టింది. బైక్‌పై వెళ్తున్న హైకోర్టు న్యాయవాది సి.హెచ్.జనార్దనరావుకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం ఆయన మృతి చెందారు. రోడ్లపై వాహనాలు విచ్చలవిడిగా నడపటం వల్ల ఈ విధంగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. నియంత్రణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టిడ్కో..ఎప్పటికో?

● శిథిలావస్థకు చేరిన గృహ సముదాయాలు
● కూటమి ప్రభుత్వంపైనే లబ్ధిదారుల ఆశలు



తుప్పుపట్టిన ఇనుప చువ్వలు, పిచ్చి మొక్కల మధ్య గృహ సముదాయాలు

రేపల్లె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నిర్మాణం పూర్తికాకుండానే టిడ్కో గృహాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. లబ్ధిదారులు కిస్తీలు కడుతున్నా.. గృహ ప్రవేశానికి నోచుకోవడం లేదు. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నా.. ఇంత వరకు ఎలాంటి శుభవార్త వారి చెవిన పడలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన గృహనిర్మాణాలను.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమే పూర్తి చేసి.. తమను ఇంటి యజమానులను చేయాలని కోరుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ పేదల కోసం.. టిడ్కో గృహ సముదాయాలను ప్రారంభించారు. కొంత మేరకు అప్పుడు పనులు జరగగా.. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షగట్టి.. ఈ గృహాలను ఐదేళ్లూ ఎలాంటి అభివృద్ధి లేకుండా అలానే వదిలేసింది. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ గృహ సముదాయాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరి, ఏపుగా పిచ్చి మొక్కలతో అధ్వానంగా తయారయ్యాయి.

● రేపల్లె మండలంలోని అరవపల్లి పంచాయతీ శివారు గుంటూరువారి ఎస్సీ కాలనీ సమీపంలో 11 ఎకరాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం గృహ సముదాయాలకు కేటాయించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణాలను ప్రారంభించారు. ఈ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

● నగర పంచాయతీలో 1,373 పక్కా గృహాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతించిది. అధికారులు ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించారు. వాళ్లందరితో లబ్ధిదారుల వాటా నగదును విడతల వారీగా చెల్లించుకున్నారు. పేదలకు అందజేసే ఈ ఇళ్లను విస్తీర్ణం ఆధారంగా 3 రకాలుగా విభజించారు. 300, 365 చదరపు అడుగుల విస్తీర్ణంలో పడకగది ఇల్లు, 430 చరపు అడుల్లో రెండు పడకల గదుల ఇల్లు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. 300 చదరపు అడగుల ఇంటి లబ్ధిదారులు ఒకేసారి తమ తమ వాటాగా రూ.5వేలు చెల్లించాలి. 365చ.అ గృహానికి 4 విడతల్లో రూ.50 వేలు, 430 చ.అ ఇంటికి 4 విడతల్లో లక్ష రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటకే లబ్ధిదారులు రెండు కిస్తీలు చెక్కుల రూపంలో అప్పులు చేసి జమ చేశారు.

కూటమిపైనే ఆశలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటుతున్నా నేటికి టిడ్కో గృహాలపై దృష్టిసారించకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశ నెలకొంది. వేలాది రూపాయలు గృహాల కోసం కట్టి.. అద్దె గృహాల్లో నివాసం ఉంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగించుకోవాలి

బాపట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాపట్ల కోర్టుల సముదా యం నందు శనివారం జరిగే జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.శ్యాంబాబు కోరారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ 13వ తేదీ జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సివిల్ కేసులు, రాజీపడతగిన క్రిమినల్ కేసులు ముందస్తుగా రాజీ చేసుకోదలిచిన కేసులు ఇరుపక్షాల మధ్య సామరస్య పూర్వకంగా రాజీ చేసి పరిష్కరిస్తారన్నారు.

ఆర్టీసీ డీఎంగా గురవారెడ్డి


ఎస్.గురవారెడ్డి

బాపట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఎస్.గురవారెడ్డి బాధ్యతలు చేపట్టారు. కొన్ని నెలలు క్రితం ఇక్కడ డీఎంగా పనిచేసిన శ్రీమన్నారాయణ ఉద్యోగ విరమణ చేయటంతో అప్పటి నుంచి చీరాల డిపో మేనేజర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ వచ్చారు. ప్రస్తుతం విజయవాడ హెడ్‌ఆఫీస్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన బాధ్యతలు చేపట్టారు.

మానవతా స్వచ్ఛంద సంస్థ నూతన బ్రాంచ్ ఏర్పాటు

కర్లపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 139 కేంద్రాలతోపాటు 97వేల సభ్యులతో ఆపదలో ఉన్న వారికి సహాయం చేస్తున్న సంస్థ మానవత స్వచ్ఛంధ సేవాసంస్థ అని తూనుగుంట్ల వెంకట సుబ్బారావు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య కల్యాణ మండపం నందు మండలంలో ప్రస్తుతం 200మంది సభ్యులతో ఆదివారం ఉదయం 10గంటలకు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ నూతన బ్రాంచ్ ఏర్పడుతుందని సభ్యత్వం పొందిన అందరు పాల్గొనాలని తెలిపారు.

కుంచాలవారిపాలెంలో గ్రామసభ

చెరుకుపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : పొలంబడిలో భాగంగా శుక్రవారం చెరుకుపల్లి మండలం కుంచాలవారిపాలెంలో వ్యవసాయ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఏడీఏ లక్ష్మీ మాట్లాడుతూ పొలంబడి ముఖ్య ఉద్దేశ్య శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతుల వద్దకే వెళ్ళి వారికి సాంకేతిక సలహాలు శాస్త్రీయ పద్ధతుల ద్వారా సాగుచేయడంపై అవగాహన కల్పించడం వల్ల వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎండి ఫారూక్, ఏఈవో టీడీ రామకృష్ణ, వీఏఏ బ్రహ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

టైఫాయిడ్ వ్యాక్సిన్ అందజేత

రేపల్లె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రేపల్లె బ్రాంచ్ ఆధ్వర్యంలో బయోమిటికేర్ సహకారంతో రామకృష్ణ పబ్లిక్ స్కూల్లో మౌంట్‌ఫోర్టు స్కూల్ విద్యార్థులకు అతితక్కువ రేటుకు టైఫాయిడ్ వ్యాక్సిన్ వేయనున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ వీవీ రామవయ్య తెలిపారు. మూడు పాఠశాలల్లో 500 మంది విద్యార్థులకు వ్యాక్సిన్ ఇవ్వటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు పంపిణీ

రేపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మార్కెట్ యార్డు ఆవరణలో సరిపడా యూరియాను అందించటం జరిగిందని వ్యవసాయ శాఖ ఏవో మహేష్‌బాబు తెలిపారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం యూరియా స్లిప్‌లను రైతులకు అం దించారు. గ్రోమోర్ సెంటర్‌లో ఎరువులను పంపిణీ చేశారు. రైతులకు సమృద్ధిగా యూరియా అందించటం జరుగుతుందన్నారు. వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల ఎంపికలు

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ పోటీల్లో భాగంగా మండలస్థాయి ఖోఖో పోటీలు పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. మండలంలోని విద్యార్థులకు అండర్-14, 17 బాలబాలికలకు సంబంధించి ఖోఖో ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. విశేష ప్రతిభ కలిగిన విద్యార్థులను మండలస్థాయిలో ఎంపిక చేసి డివిజన్ స్థాయి పోటీలకు పంపుతామని మండల కోఆర్డినేటర్ ఎం.ప్రశాంతబాబు తెలిపారు. కార్యక్రమంలో పీడీ కె.కరీముల్లా, శ్రీరామరెడ్డి, సత్యనారాయణరెడ్డి, గంగరాజు, ప్రిన్సిపాల్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు చెక్కులు పంపిణీ

రేపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇసుకపల్లి భ్రమరాంబచెన్నమల్లేశ్వరస్వామి కల్యాణమండపంలో సంగం డెయిరీ రేపల్లె ఏరియా బీఎంసిల ప్రాంతీయ అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. డీఆర్‌ఎఫ్ పథకం కింద రాచూరి వెండర్ అయ్యిన కె.ధనలక్ష్మి ఇటీవల మరణించటంతో వారి నామినీ అయిన కేసన బసవపున్నయ్యకు రూ. 1,34,297ల చెక్కును అందించారు. కోనఫలం, ఆరేపల్లి, పిల్లలవారిపాలెం, వుయ్యూరువారిపాలెం, కేంద్రాలకు చెందిన రైతులకు రూ. 2,20,000 చెక్కులను అందించారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్, జిల్లా జోనల్ డైరెక్టర్ టి.వీరేంద్ర, లక్ష్మీజ్ఞానానంద భగవాన్, పర్వతనేని అనిల్‌కుమార్, పాతూరి ఆదినారాయణ, పశు వైద్యులు శివరామకృష్ణ, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కర్లపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెంలోని జాతీయ రహదారి పక్కన యూనియన్ బ్యాంకు ఎదురుగా ఉన్న శ్రీనివాస కూల్‌డ్రింక్ షాపులో గత నెల 30వ తేదిన చోరీకి పాల్పడిన నిందితుడు కుంభా వెంకటేష్‌ను కర్లపాలెం సెంటర్లో అరెస్టు చేశామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. నిందితుడి నుంచి నగదును రికవరీ చేశామని.. నిందితుడు కుంభా వెంకటేష్ చుండూరు గ్రామానికి చెందినవాడని ఇతని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.

తూర్పుసత్రానికి పూర్వవైభవం తెస్తాం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తూర్పుసత్రానికి పూర్వవైభవం తీసుకువచ్చి ఆస్తులు పరిరక్షిస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. తూర్పుసత్రం పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం బాపట్ల పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున రూ.70కోట్ల విలువ చేసే 4ఎకరాల60సెంట్ల భూమిని నాడు పేరం గరుడాచలంనాయుడు ఇచ్చారన్నారు. ప్రభుత్వాలు ఏవైనా దీనిని అన్యాక్రాంతం చేయాలని, లీజుకు తీసుకోవాలని, అవసరానికి ఉపయోగించుకోవాలని అనేక మంది ప్రయత్నాలు చేశారన్నారు. పవిత్రమైన మనస్సుతో బాపట్ల బాగుండాలని గరుడాచలం నాయుడు దీనిని ఏర్పాటు చేశారన్నారు. కాపుల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా తూర్పుసత్రం ఏర్పాటు చేశారన్నారు. తూర్పుసత్రం భూమి హద్దులు నిర్ణయించి ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నూతన పాలకవర్గం చైర్మన్ గుంటుపల్లి తులసీకుమారి విశ్రాంత ఎంఈవో కాబట్టి సమర్థవంతంగా అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం చైర్మన్‌గా గుంటుపల్లి తులసీకుమారి, సభ్యులుగా డి.శిరీషా, ఆవుల వెంకటసుబ్బమ్మ, ఎన్.రమాదేవి, పులివర్తి కిరణ్, పంచాజ్ఞల రుక్మిణి, దేవరకొండ చెన్నకేశవులు, శిఖరం శ్రీను, కె.కిరణ్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. నూతన చైర్మన్‌ను జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు, జనసేననాయకులు విన్నకోట సురేష్, పట్టణ, మండల టీడీపీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, పల్లం సరోజనీ, జి.గిరిజారాణి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడిగా బ్రహ్మయ్య

బాపట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ బాపట్ల రెవెన్యూ డివిజన్ యూనిట్ ఎన్నికలు శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగాయి. ఎన్నికల అధికారిగా కారంచేడు తహసీల్దార్ జి.నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కె.మహబూబ్‌బాషాలు వ్యవహరించారు. సంఘ నియమనిబంధనలు మేరకు జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా కె.బ్రహ్మయ్య, ఉపాధ్యక్షుడిగా కెశ్రీదేవి, టి.ప్రశాంతి, కె.సాయిప్రకాష్, జెఎసిఎ సెక్రటరీగా ఎస్‌టీకే విష్ణుప్రసాద్, జాయింట్ సెక్రటరీగా బి.సుధాజ్యోతి, డి.ఆనందరావు, కోశాధికారిగా పి.సుధారాణి, ఈసీ మెంబర్లుగా కె.మణికంఠ, ఎస్‌కె.మాబుసుభానీ, ఎ.పావనిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారితో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆర్డీవో పి.గ్లోరియాను మర్యాదపూర్వకంగా కలిసి నూతనకమిటీని పరిచయం చేశారు. ఆర్డీవో వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌సురేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఓంకార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నూతన కార్యవర్గం

విద్యార్థులు ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలి : ఎంఈవో

బాపట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆటల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని ఎంఈవో డి.ప్రసాదరావు తెలిపారు. ఈ విషయమై శుక్రవారం వ్యాయామ ఉపాధ్యాయులతో ఆయన సమావేశం అయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ బాపట్ల మండల స్థాయి ఆటల పోటీలు 15వ తేదీ సోమవారం జరుగుతాయన్నారు. అండర్-14, 17 బాలికలకు 17వ తేది, బాలురకు 18వ తేది మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పాల్గొనే విధంగా చూడాలని ఆయన తెలిపారు.

టీబీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

బాపట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పికట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో టీబీ బాధితులకు శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ ఇనగంటి అనురాధ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి రోగులకు పౌష్టికాహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఉస్మాన్, సూపర్‌వైజర్ మేరీ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కేటాయించాలి

● అంగిరేకుల వరప్రసాద్ యాదవ్

బాపట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. బాపట్లలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే శాసనసభ సమావేశాలలో దీనిపై బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పేరయ్య, వెంకటేష్, స్థానిక నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, ఉన్నవ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

యాజలి, దుండివారిపాలెం పంచాయతీల్లో ఎంపీడీవో తనిఖీ

కర్లపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాజలి దుండివారిపాలెం పంచాయతీలను ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ఆదివారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చింతాయపాలెంలో ప్రజల చేతిలో ప్రభుత్వం కార్యక్రమాన్ని కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎంపీడీవో ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పీతా శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

బడి ఈడు పిల్లలను బడిలోకి పంపాలి

కర్లపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బడి ఈడు పిల్లలను బడిలోకి పంపాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం దుండివారిపాలెం అక్కిరాజు దిబ్బలోని ఎస్టీ కుటుంబాలవారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో విజయశ్రీ, ఎస్‌ఐ రవీంధ్ర, వీరాస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వీర్యం చేయాలని చూస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి


మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతంలో మాట్లాడుతున్న కోన రఘుపతి

బాపట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మెడికల్ కళాశాలను నిర్వీర్యం చేయాలని చూస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయటాన్ని నిరసిస్తూ శుక్రవారం పార్టీశ్రేణులతో కలిసి జమ్ములపాలెంరోడ్డులోని మెడికల్ కళాశాల నిర్మిస్తున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. నిర్మాణం జరిగిన పిల్లర్‌లను చూయించి జరిగిన పనిని జరగలేదని విమర్శించటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలురెడ్డి, ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, జిల్లాపార్టీ ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

ఎన్‌ఏబీఎల్ అక్రిడేషన్‌పై విద్యార్థులకు అవగాహన

బాపట్లరూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం ఎవర్నెస్ ప్రోగ్రామ్ ఆన్ ఎన్‌ఎబీఎల్ అక్రిడేషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌ఎబీఎల్ బెంగళూరుకు చెందిన డైరెక్టర్ రామచంద్రయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ చిన్నమ్మరాజు, కోఆర్డినేటర్ ప్రవళికలు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలి

రేపల్లె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ జిల్లా రెండవ మహాసభలు సెప్టెంబరు 27, 28 తేదీల్లో శ్రీ శుభంకర ఏలైట్‌లో జరుగునని, ఈసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ రేపల్లె ఏరియా కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. సీఐటీయూ జిల్లామహాసభలు పోస్టర్లను వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు, సీఐటీయూనాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వై.కిషోర్, కొప్పుల గోపి, సీహెచ్ ప్రకాష్, డి.నాగరాజు, కె.గాంధీ, డి.శ్రీనివాసరావు, జీవెంకటేశ్వరరావు, వై.నవీన్, కె.రమేష్, డి.అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు తక్షణమే మంజూరు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

రేపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, ఉద్యోగులకు రాష్ట్రప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు, నాలుగు డీఏలు తక్షణమే మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి వీడీ సోషలిజం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 57 జీవో ప్రకారం ఉపాధ్యాయులకు సీపీఎస్, అసిస్మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలని తదితర డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తేలప్రోలు శ్రీనివాసరావు, డి.పవన్‌కుమారి, కె.వెంకటరత్నం, ఎంసిహెచ్ రాజారత్నం, జే.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు కొల్లూరులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రెడ్డి పద్మజ, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్లు మాలకొండయ్య, శివనాగేశ్వరరావు, రవికిరణ్, సుధాకర్, మంజుల ఉన్నారు.

● పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయటంలోను తాత్సారం చేస్తుందని మండల ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజే శారు. ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు ఎల్.చక్రపాణి, ప్రధాన కార్యదర్శి ఎన్.నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేసినవారిలో ఉన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

కొల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా పంపిణీ చేశారు. మండల పరిధిలోని చినపులివర్రు రైతు సేవ కేంద్రంలో 270 బస్తాల యూరియా, 200 బస్తాల డీఏపీ సరఫరా కాగా, వ్యవసాయాధికారులు కొల్లూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు యలవర్తి కోటేశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఏవో నరేంద్రబాబు, రెవెన్యూ, వ్యవసాయ, పోలీసు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అసిస్టెంట్ కమిషనర్


షాపులను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ

నగరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ శుక్రవారం నగరంలోని ఎక్సైజ్ కార్యాలయం, ఏ4 షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ పెండింగ్ విచారణలు, ఎన్‌బీడబ్ల్యూలు, లోక్ అదాలత్ కేసులను త్వరగా పరిష్కరించాలని అన్నారు. అదేవిధంగా ఏ4 షాప్‌లలో ఎంఆర్‌పి టైమింగ్ ఉల్లంఘనలు జరగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మార్టూరి శ్రీరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అక్రమ్‌ఘోరీకి సన్మానం

చెరుకుపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉర్దూ గూడవల్లి గ్రామంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎండీ అక్రమ్‌ఘోరీ ఈనెల 5న బాపట్లలో జరిగిన గురుపూజోత్సవంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. సదరు ఉపాధ్యాయుడిని, ఆయన సతీమణి షేక్‌పర్వీన్‌ని శుక్రవారం చెరుకుపల్లి మండలంలోని అన్ని ఉర్దూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో లాజర్, ఉర్దూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు రజియాబస్రీ, ఆరిఫా, షమాయతున్నిసా, ముంతాజ్‌బేగం, అమీరున్నిసా, మొహమ్మద్‌నజీర్ అహ్మద్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు పర్వీన్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ షబీన్ పాల్గొన్నారు.

లచ్చి కోటేశ్వరరావుకు...

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో విద్యార్థులకు బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు లచ్చి కోటేశ్వరరావు ఇటీవల గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని అల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల నందు శుక్రవారం లచ్చికోటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఈవో పి.పురుషోత్తం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెజ్జం పద్మారావు అధ్యక్షత వహించగా డీవైఈవో కె.సురేష్, ఇన్‌చార్జి ఎంఈఓలు, నిజాంపట్నం ఎంఈవోలు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణాలకు రూ.2.16 కోట్లు

అమృతలూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా పశ్చిమ డెల్టా తూర్పు, నిజాంపట్నం కాల్వలపై నూతన వంతెనల నిర్మాణానికి రూ.2.16 కోట్లు మంజూరైనట్లు పెదపూడి పీఏసీఎస్ చైర్మన్ కొసరాజు దేవకుమార్ శుక్రవారం తెలిపారు. అమృతలూరు నుంచి తురుమెళ్ల వెళ్లే రహదారులు తూర్పు కాల్వ, నిజాంపట్నం కాల్వలపై తురుమెళ్ల వద్ద రెండు వంతెనల నిర్మాణాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. నిధులు మంజూరు కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు తురుమెళ్ల గ్రామస్థుల తరుపున పీఏసీఎస్ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

అమృతలూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగా హన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఈగల్ అండ్ శక్తి టీమ్ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఎస్‌ఐ రవితేజ మాట్లాడుతూ డ్రగ్స్‌పై విద్యార్థులు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో 11కేవీ రేపల్లెటౌన్2 ఫీడర్‌లో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్‌శాఖ డీఈ డి.శ్యామ్‌సుధాకరబాబు తెలిపారు. మండల పరిధిలోని 33కేవీ గంగడిపాలెం ఫీడర్‌లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

● కొల్లూరు : చిలుమూరు, జువ్వలపాలెం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సుధాకరబాబు తెలిపారు.

● భట్టిప్రోలు (కొల్లూరు) : భట్టిప్రోలు విద్యుత్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ శ్యాంసుధాకరబాబు శుక్రవారం తెలిపారు.

● వేమూరు : మండలంలోని పెరవలి 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి పెరవలిపాలెం ఫీడర్‌లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ గోపి తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందించిన ఎమ్మెల్యే ఆనందబాబు


బాధిత కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న వారి వైద్య చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిన రూ.5.62 లక్షల చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గుంటూరు క్యాంపు కార్యాలయంలో మండలంలోని బాధిత కుటుంబాలకు అందించారు. మున్నంగివారిపాలేనికి చెందిన పడాల సాంబశివరావుకు రూ.3,75,400, ప్రసాదం శంకర్‌కు రూ.30,786, కుర్రి వెంకటకృష్ణారెడ్డికి రూ.31,580, తోడేటి స్పందనకు రూ.1.25 లక్షలు వంతున మంజూరైన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు కుర్రి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు జిల్లాల నీటి సమస్య పరిష్కారం

● వచ్చే వేసవిలో ఎత్తిపోతల పథకం వద్ద షట్టర్లు ఏర్పాటు

● లంకేవానిదిబ్బకు తాగు, సాగునీటి సమస్య లేకుండా పరిష్కారం

రేపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాగు, సాగునీటి కోసం కృష్ణా..బాపట్ల జిల్లాల మధ్య ఏర్పడిన వివాదం అధికారులు పరిష్కరించారు. రేపల్లె మండలంలోని రాజుకాల్వ ఎత్తిపోతల పథకం వద్ద రెండుజిల్లాల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి కరకట్టలను పరిశీలించారు. లంకేవానిదిబ్బ, కృష్ణాజిల్లా నాగాయలంక మండలం ఎలిసెట్లదిబ్బ గ్రామాలకు సంబంధించిన త్రాగు,సాగునీటి సమస్య గత కొంతకాలంగా వివాదాస్పదంగా మారింది. దీంతో ఇరుజిల్లాల అధికారులు, నాయకులు, ప్రజలు రాజుకాల్వ ఎత్తిపోతల పథకం వద్ద సమావేశం నిర్వహించారు. రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, మచిలీపట్నం ఇన్‌చార్జ్ ఆర్డీవోగా శ్రీదేవి, ఇరిగేషన్ శాఖాధికారులు, ఆర్‌సీ అధికారులు రెండు జిల్లాల గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించారు. కృష్ణా జిల్లా ఎలిసెట్లదిబ్బ గ్రామంలో 1500 ఎకరాల సాగుభూమికి తాగునీరు అందించాలని, నది మధ్యలో ఉన్న గ్రామానికి తాగునీరు అందించాలని ఆ గ్రామస్థులు కోరారు. రేపల్లె మండలం లంకేవానిదిబ్బ, రాజుకాల్వ, లక్ష్మీపురం గ్రామస్థులు కృష్ణాజిల్లాకి నీరు విడుదల చేయటంతో తమ గ్రామాలకు తాగు, సాగునీరు అందటం లేదని వాపోయారు. ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన వాతావరణంలో సమస్య పరిష్కారం కోసం అధికారులు, ప్రజలు సమన్వయంతో చర్చించారు. రానున్న వేసవిలో ఎత్తిపోతల పథకం వద్ద షట్టర్లను ఏర్పాటు చేసి నీటిని పంపించే విధంగా ఒప్పందమయ్యారు. దీంతో ఎన్నో రోజులుగా నెలకొన్న సమస్య చర్చల ద్వారా పరిష్కారమైంది. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ ఇరిగేషన్ సర్కిల్ విజయవాడ ఆర్.మోహన్‌రావు, కేసీ విజయవాడ ఈఈ ఆర్.రవికిరణ్, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, రెండు జిల్లాల పోలీస్ అధికారులు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడిపాపారావు, మండల మాజీ ఉపాధ్యక్షుడు కొపనాతి రాజశేఖర్, ఆర్‌సీ ఏఈ నాగేశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


రాజుకాల్వ ఎత్తిపోతల పథకం వద్ద తాగు, సాగునీటి సమస్యపై కృష్ణా, బాపట్ల జిల్లాల ప్రజలతో సమావేశమైన ఆర్డీవోలు, మంత్రి సోదరుడు శివప్రసాద్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే వేదిక

● టీడీపీ రాష్ట్ర చేనేత కార్మిక కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు


అర్జీలను స్వీకరిస్తున్న జీవీ నాగేశ్వరరావు తదితరులు

రేపల్లె, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలసమస్యలను పరిష్కరించేందుకే ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర చేనేత కార్మిక కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పనిచేస్తుందని వారి ఇచ్చిన ఫిర్యాదులన్నీ పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. మొత్తం 30ఫిర్యాదులు అందాయని వాటిల్లో ఎక్కువగా 20నివేశనస్థలాలకోసం ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. వాటన్నింటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, నాయకులు దున్నా జయప్రద, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, తాడిపర్తి మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కొల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో ఎలుకల మందు తిని అస్వస్థతకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ జానకీఅమరవర్ధన్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పొన్నూరు మండలం ఇటికంపాడుకు చెందిన గుర్రం వెంకటేశ్వరమ్మ (28) కొల్లూరుకు చెందిన నంబూరి కోటయ్యతో సంవత్సరం క్రితం వివాహం జరిగింది. కొల్లూరులోని చికెన్ షాపులో కోటయ్య పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 4న రాత్రి మద్యం తాగి ఆ మత్తులో తన భర్తకు ఫోన్ చేసి ఇంటికి రమ్మని కోరగా, ఆలస్యంగా వస్తానని చెప్పడంతో మత్తులో ఉన్న ఆమె కోపంతో ఇంటిలో ఉన్న ఎలుకల పేస్టు తినేసింది. 5వ తేదీ ఉదయం తన అన్నకు ఫోన్ చేసి తన భర్తపై కోపంతో ఎలుకల మందు తిన్నట్లు చెప్పింది. ఈ విషయాన్ని ఆమె అన్న నాగార్జున తన రెండవ చెల్లెలు తిరుపతమ్మకు చెప్పడంతో వెంకటేశ్వరమ్మను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వెళ్లారు. ఈనెల 10న మెరుగైన వైద్యం కోసం అక్కడ వైద్యులు గుంటూరు జీజీహెచ్‌కు తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆమె అన్న నాగార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

చెరుకుపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 15, 16 తేదీలలో క్రీడాపోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయబడతారని ఎంఈవో లాజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక అండర్-14, 17 విభాగాలలో జరుగుతాయన్నారు.

ఇళ్లపై విస్తరిస్తున్న సోలార్ పలకలు..

- సూర్యఘర్ పథకంపై ప్రజల ఆసక్తి
- వేమూరులో 312 మంది రాయితీ వినియోగం
- యాప్ ద్వారా దరఖాస్తులు ● అదాని కంపెనీ.. ఆటోమెటిక్ మీటర్లు

వేమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ బిజిలి యోజన ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బంపర్ ఆఫర్‌తో రాయితీలు ప్రకటించడంతో విద్యుత్ వినియోగదారులు సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. 200 యూనిట్స్ వరకు విద్యుత్ ఉచితంగా పొందే ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ప్రభుత్వం ఉచితంగా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తోంది. బీసీ, ఓసీలకు సబ్సిడీని ప్రకటించడంతో వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో పీఎం సూర్యఘర్ యాప్ ద్వారా ప్రజలు దరఖాస్తు చేసుకుంటున్నారు. కేవలం 45 రోజుల వ్యవధిలో నియోజకవర్గం నుంచి 312 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రాయితీపై రెండు రోజుల వ్యవధిలోనే వారి గృహాలపై సోలార్ పవర్ సిస్టం ఏర్పాటు చేసింది. ప్లేట్స్ ఏర్పాటు చేసిన తక్షణమే అదానీ కంపెనీ ద్వారా ఆటోమేటిక్ మీటర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ మీటర్ల ద్వారా ట్రాన్స్ కో సిబ్బంది విద్యుత్ యూనిట్స్ రికార్డు చేస్తారు. వినియోగదారుడి గృహ అవసరాలకు సరిపోను..మిగులు విద్యుత్‌ను ఆటోమేటిక్‌గా ట్రాన్స్ కో సిస్టంకు చేరుతుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి ట్రాన్స్ కో యూనిట్‌కు రెండు రూపాయల పది పైసల చొప్పున వినియోగదారుని బ్యాంకు ఖాతాకు జమ చేస్తుంది. వేమూరు మండలంలో 85, చుండూరు మండలంలో 52 , అమృతలూరులో 60, భట్టిప్రోలులో 70, కొల్లూరు మండలంలో 45 మంది వినియోగదారులు సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకున్నట్లు ట్రాన్స్ కో అధికారులు వివరించారు. వీరంతా 3 కిలోవాట్స్ ప్లేట్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వాటి ఖరీదు రూ.2 లక్షలు కాగా ప్రభుత్వం ఇచ్చే రూ.78 వేలు రాయితీ ఇస్తోంది. మిగిలింది వినియోగదారుడు చెల్లించాలి.. దీనికి కూడా బ్యాంకర్లు రుణ సదుపాయం కల్పించేందుకు వినియోగదారులకు సహకరిస్తున్నారు.



వేమూరులో వినియోగదారుని ఇంటిపై సోలార్ ప్లేట్స్ బిగిస్తున్న టెక్నీషియన్లు

నరసపూర్, మైసూరుకు ప్రత్యేక రైళ్లు



గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పండగల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా నరసపూర్, మైసూరుకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07033 నరసపూర్ - మైసూరు ప్రత్యేక రైలు ఈ నెల 19, 22, 26, 29, అక్టోబరు 3, 6, 10, 13, 17, 20, 24, 27, 31 తేదీల్లో ఉదయం 11.35కి బయలుదేరి మధ్యాహ్నం 3.15కి గుంటూరు, 4.03కి సత్తెనపల్లి, 4.33కి పిడుగురాళ్ల, సాయంత్రం 5.03కి నడికుడి, రాత్రి 10.05కి సికింద్రాబాద్, మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు మైసూరుకు చేరుకొంటుంది. 07034 మైసూరు - నరసపూర్ ప్రత్యేక రైలు ఈ నెల 20, 23, 27, 30, అక్టోబరు 4, 7, 11, 14, 18, 21, 25, 28, నవంబరు 1 తేదీల్లో సాయంత్రం 5.20కి బయలుదేరి రాత్రి 8.45కి బెంగళూరు, మరుసటి రోజు ఉదయం 10.10కి సికింద్రాబాద్, మధ్యాహ్నం 12.58కి నడికుడి, 1.28కి పిడుగురాళ్ల, 1.58కి సత్తెనపల్లి, సాయంత్రం 4.45కి గుంటూరు, రాత్రి 9 గంటలకు నరసపూర్ చేరుకొంటుందన్నారు. స్లీపర్, ఏసీ త్రీటైర్, టూ టైర్ బోగీలు ఉంటాయి.

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యంతో..
ప్రాణం పోతోంది

అన్నింటికీ..యాంటీ బయోటిక్స్

సత్తెనపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా తురకపాలెంలో తీవ్ర కలకలం రేపిన వరుస మరణాల కేసులో స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అంటున్నారు. కలుషిత మైన సిలేన్ వాడకం, మోతాదుకు మించి శక్తి వంతమైన యాంటి బయోటిక్స్ వాడినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం సత్తెనపల్లి డివిజన్‌లో కూడా జ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామీణ ప్రజలు ముందుగా ఆర్ఎంపీ వద్దే చికిత్స పొందుతున్నారు.

- సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు, రాజుపాలెం, ముప్పాళ్ళ, సత్తెనపల్లి మండలాల్లో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువ. ప్రస్తుతం ప్రాథమిక వైద్య చికిత్సల పేరుతో ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లను పొందిన వారు వైద్యుల అవతారం ఎత్తేశారు. కాలు తెగినా కట్టు కట్టాలే తప్ప. కుట్లు వేయటానికి అర్హత లేని వారు డాక్టర్ బోర్డులు పెట్టుకొని క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. మరి కొంత మంది మెడికల్ షాపులు, ఆస్పత్రులు నిర్వహిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సినిమాలో శంకర్ దాదా ఎంబీబీఎస్ చేయడానికి మోసం చేస్తే నిజ జీవితంలో ఆర్ఎంపీలు ఏకంగా వైద్యం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో కొన్ని చోట్ల ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఆయా మండలాల్లో రెండు వందల మందికి పైగా ఆర్ఎంపీలు, పీఎంపీలుగా పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులుగా అవతారం ఎత్తి ప్రజలపై తమ వైద్య ప్రయోగాలు చేస్తున్నారు. మరి కొంతమంది తమ హస్తవాసి మంచిదంటూ ఆపరేషన్‌లు కూడా చేస్తూ ప్రజల ప్రాణాలను గాలిలో కలిపేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రిళ్ల ప్రభుత్వ, క్వాలిఫైడ్ వైద్యులు అందుబాటులో లేక పోవడంతో ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రజల గుమ్మాల్లో వాలుతున్నారు. సమయానికి వైద్యం చేయడంతో ప్రజల్లో వారిపై నమ్మకం కలుగుతోంది.
- కొందరు ఆర్ఎంపీలు ప్రమాదకర యాంటీ బయోటిక్స్ స్టెరాయిడ్స్ రాస్తున్నారు. దద్దుర్లు వచ్చినా అవే వాడుతున్నారు. వారు ఇచ్చిన స్టెరాయిడ్స్ అత్యధిక పవర్ కలిగిన యాంటీ బయోటిక్స్ వల్ల వైద్యం చేయడానికి ఆస్కారం లేకుండా పోతోంది. కొంత మంది ఆర్ఎంపీ, పీఎంపీలు పట్టణాల్లోని ప్రైవేట్ వైద్యశాలలతో ఒప్పందాలు చేసుకొని తమ ప్రాంతాల నుంచి రోగులను పంపించి పర్సన్‌టేజ్‌లను అందుకుంటున్నారు. ఇంకా కొంత మంది గ్రామాల్లో తమ వద్దకు వచ్చే రోగులకు జనరిక్ మందులను అంటగట్టి అధిక సొమ్ములు వసూలు చేస్తున్నారు. యాంటీ బయోటిక్స్ స్టెరాయిడ్స్‌ను వాడటం వల్ల రోగుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి.. చిన్న వ్యాధిని కూడా తగ్గించుకోలేని పరిస్థితులు వస్తున్నాయి. ఆర్ఎంపీ, పీఎంపీల వద్ద గ్రామాల్లో వైద్యం చేయించుకున్న 30 సంవత్సరాల్లోపు యువకులు కూడా బీపీ, షుగర్ బారిన పడుతున్నారు. ఆర్ఎంపీ, పీఎంపీల వైద్య సేవలపై హైకోర్టు, సుప్రీం కోర్టులు ఎన్నో తీర్పులు ఇచ్చాయి. ప్రభుత్వాలు వాటిని అమలు చేయక పోవడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు వీటిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి.. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేంద్ర పథకం..వితంతువులకు ఆర్థిక సాయం



- దరఖాస్తు చేసుకుంటే రూ.20 వేలు
- 18-59 మధ్య వయస్సు వారు అర్హులు
- 2017 ఏప్రిల్ 12 తర్వాత భర్త మరణించిన వారికి అవకాశం

వేమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు పరిచే అనేక పథకాలలో జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) ఒకటి. ఇది వితంతువుల కోసంగా ప్రవేశపెట్టింది. ఈ పథకం ప్రచారంలో లేక బాధితులకు సాయం అందడం లేదు. ఒక కుటుంబంలో ప్రాథమిక సంపాదన కలిగిన వ్యక్తి మరణిస్తే.. ఒకేసారి రూ.20 వేల సాయం ఈ పథకం ద్వారా అందుతుంది. అతని భార్యకు ఈ సాయాన్ని అందిస్తారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వితంతు మహిళకు మాత్రమే ఈ సంక్షేమ పథకం వర్తిస్తుంది. 2017 ఏప్రిల్ 12వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలులోకి తెచ్చింది. ఈ పథకం అమలులోకి వచ్చిన తదుపరి మృతి చెందిన వ్యక్తి భార్యకు నిబంధనల ప్రకారం వినియోగించుకునే అవకాశం ఉంది. సహజంగా లేదా ఇతరత్రా కారణాలతో మరణించినా పథకం వర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అందించే సాధారణ పింఛన్లు, స్పౌజ్ పింఛన్లు అందుకునే వారు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన దరఖాస్తును మండల రెవెన్యూ కార్యాలయాల్లో ఇస్తారు. దరఖాస్తు పూర్తి చేసి తిరిగి తహసీల్దార్ కార్యాలయంలోనే సమర్పించాలి. దరఖాస్తుతో పాటుగా వయస్సు, మరణించిన వ్యక్తి ధృవీకరణ పత్రాలు, ఆధార్, ఆదాయం, రేషన్ కార్డు జిరాక్సులతో పాటు బ్యాంకు ఖాతా నంబరు కూడా అందించాలి. తహసీల్దార్ దరఖాస్తును పూర్తిగా పరిశీలన చేసిన అనంతరం.. ఆన్‌లైన్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. కేంద్ర రెవెన్యూ శాఖ ఆమోదంతో లబ్ధిదారులు బ్యాంకు ఖాతాకు రూ.20 వేలు నగదు జమ చేస్తారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఈ పథకానికి దరఖాస్తులు చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూడా అర్హులైన మహిళలు పథకాన్ని వినియోగించుకునేందుకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంది.

ఆ రైళ్ల కోసం.. నిడుబ్రోలు నిరీక్షణ..!



నిడుబ్రోలు రైల్వే స్టేషన్

- రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌కు వినతులు
- దశాబ్దాలుగా తప్పని ఎదురుచూపులు
- గుంటూరు, తెనాలి, బాపట్ల వెళ్తున్న ప్రయాణికులు
- తమలపాకు, మినుముల వ్యాపారులకు అవస్థలు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌కు విశిష్ట స్థానం ఉంది. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు ఆచార్య ఎన్జీ రంగా స్వగ్రామం నిడుబ్రోలు. దశాబ్దాల క్రితమే ఈ రైల్వేస్టేషన్ ఏర్పాటైంది. విజయవాడ - చెన్నై ప్రధాన రైలు మార్గంలోని నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌లో నిన్న మొన్నటి వరకు వసతుల కొరత వేధించేది. ఇటీవల రైల్వేస్టేషన్‌ను కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేశారు. కానీ, ఇక్కడ ఎక్స్ ప్రెస్ రైళ్లకు హాల్టు సౌకర్యం కల్పించ లేదు. ప్రయాణికులు దశాబ్దాలుగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపదల కోసం ఎదురుచూస్తున్నారు. ప్యాసింజర్ రైళ్లతో పాటు డివిజన్‌కే పరిమితమైన పినాకిని, పూరి, తిరుపతి వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లే ఇక్కడ ఆగుతున్నాయి. ఇతర రాష్ట్రాలకు ప్రయాణించే వ్యాపారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. పొన్నూరు ప్రాంతంలో పండించే తమలపాకు, అపరాల పంటలు ఎగుమతి అవుతుంటాయి. పంట ఉత్పత్తుల కోసం వ్యాపారులు పొన్నూరు ప్రాంతానికి రావాలన్నా.. తిరిగి వెళ్లాలన్న నిడుబ్రోలు రైల్వేస్టేషన్ ప్రధాన రవాణా సాధనంగా ఉంది. బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు హాల్టు లేక.. మరోవైపు బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రయాణికులు సమీపంలోని గుంటూరు, తెనాలి, బాపట్ల వంటి ప్రాంతాలకు వెళ్లి.. అక్కడి నుంచి రైలు ప్రయాణాలు సాగిస్తున్నారు.

ఆదాయం లేదనే నెపం..

పొన్నూరు ప్రాంతం ప్రముఖ స్వతంత్ర సమరయోధులకు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు స్వగ్రామం. గతంలో ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల కోసం ఉద్యమాలు జరిగాయి. ఈ సమయంలో ప్రజా ప్రతినిధులు స్పందించి రైల్వే శాఖ అధికారులను హాల్టు కోసం సంప్రదించారు. అయితే ఆదాయం తక్కువగా ఉందనే నెపంతో రైళ్ల హాల్టులకు రైల్వే శాఖ మొగ్గు చూపలేదు. ప్రధానంగా సికింద్రాబాద్ నుంచి గూడూరు వెళ్లే సింహపూరి ఎక్స్‌ప్రెస్, జన శతాబ్ది, నారాయణద్రి, శేషాద్రి వంటి రైళ్లకు ఇక్కడ హాల్టు సౌకర్యం కల్పించడం వల్ల ప్రయాణికుల సంఖ్య పెరగడంతో పాటు రైల్వే శాఖ ఆదాయం పెరుగుతుందని పట్టణ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రధానంగా రైల్వే స్టేషన్‌కి వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలి. రహదారిలో వీధి దీపాలు ఏర్పాటు చేసి, మహిళా ప్రయాణికులు రాత్రి వేళ రాకపోకలు సాగించేందుకు అవసరమైన రక్షణ సౌకర్యాలు కల్పించాలి. వయోవృద్ధులు దివ్యాంగుల కోసం లిఫ్ట్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలి. వీటితో పాటు రైల్వే కోచ్ సమాచారం తెలిపే డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తులు ఉన్నాయి. అలాగే పొన్నూరు వైపు కూడా టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయడం, గతంలో ఉన్న తమలపాకులు, చేపల ఎగుమతుల కోసం ఉన్న పార్సిల్ కౌంటర్ల ఏర్పాటు వంటి సౌకర్యాలు కల్పించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి పట్టణ వాసులు విజ్ఞప్తి మేరకు నిడుబ్రోలు రైల్వేస్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు సౌకర్యం కల్పించాలని పొన్నూరు ప్రాంత వాసులు వేడుకుంటున్నారు.

తురకపాలెం మరణాలపై వారంలో నివేదిక అందజేయాలి

- అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశం
- 109 బ్లడ్ కల్చర్ రిపోర్టుల్లో 4 శాతం మెలియోడోసిస్ కేసులు
- రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి సత్యకుమార్

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో మరణాలకు దారితీసిన కారణాలపై సమగ్ర నివేదికను వారంలోగా అందజేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తురకపాలెంలో సీనియర్ వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతూనే ఉండాలని ఆయన సూచించారు. తురకపాలెంలో నమోదైన వరుస మరణాల గురించి జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో విఫలం చెందారన్నారు. ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లే సమయంలో జ్వర పీడితులు ఎక్కువగా ఉంటే ఆ సమాచారం జిల్లా అధికారుల ద్వారా రాష్ట్ర అధికారులకు వెంటనే అందే వ్యవస్థను (సర్వైలైన్స్) శాఖాపరంగా పటిష్ఠం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో మరణాలకు దారితీసిన కారణాలు, స్థానికుల నుంచి సేకరించిన రక్త నమూనాలు, వాటి ఫలితాల గురించి రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్ ఇతర అధికారులు మంత్రి సత్యకుమార్‌కు వివరించారు.

మరణాల నమోదుకు యాప్‌లో ప్రత్యేక ఆప్షన్

తురకపాలెం ఘటన అనుభవంతో క్షేత్రస్థాయిలో ఉండే ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు యాప్‌లో ఏ రోజుకు ఆ రోజు గ్రామాల్లో సంభవించిన మరణాల గురించి నమోదు చేస్తారు. నిర్దిష్ట సంఖ్య కంటే మరణాల నమోదు ఎక్కువగా జరిగితే వెంటనే అలెర్ట్ మెసేజ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి, రాష్ట్ర అధికారులకు ఏకకాలంలో వచ్చేలా వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నారు. దీనివల్ల సకాలంలో సంబంధిత ప్రాంతాల్లోని పరిస్థితులపై అప్రమత్తమై వెంటనే సత్వర చర్యలు తీసుకోవడానికి వీలవుతుందని అధికారులు మంత్రికి వివరించారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ తురకపాలెంలో మరణాలకు దారితీసిన కారణాలపై సిఫార్సులతో ఇచ్చే నివేదికలో అక్కడ పర్యటించిన వైద్య బృందాల అభిప్రాయాలు, చేసిన సిఫార్సులు ఉండాలన్నారు.

కొత్తరెడ్డిపాలెంలోనూ అధ్యయనం చేయాలి?

తురకపాలెం మాదిరిగానే సమీపంలో ఉన్న కొత్తరెడ్డిపాలెం గ్రామస్తులకు కూడా పరీక్షలు చేయాలన్నారు. ఇక్కడి సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఇంచుమించు తురకపాలెం మాదిరిగానే ఉన్నాయని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంటు డాక్టర్ రమణ యశస్వి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

59 శాతం మందిలో కొలెస్ట్రాల్ సమస్య అధికం

తురకపాలెంలో 2018 మంది 18 ఏళ్ల పైబడిన వారున్నారు. వీరిలో 1,501 మంది స్థానికంగా ఉన్నారు. మిగిలిన వేరే ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. అందుబాట్లో ఉన్న 1,501 మందికి 42 రకాల పరీక్షలు నిర్వహించారు. రెండు వారాలుగా ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న వైద్య పరీక్షల ప్రాథమిక అంశాలను ఉన్నతాధికారులకు మంత్రి సత్యకుమార్‌కు అందజేశారు. ఈ వివరాలను పరిశీలిస్తే...

- గ్రామంలో 109 మంది జ్వర పీడితులను గుర్తించి వీరి నుంచి వైద్య శిబిరాల ద్వారా రక్త నమూనాలు సేకరించారు. బ్లడ్ కల్చర్ పరీక్ష ద్వారా కేవలం నాలుగు శాతం మందిలో 'మెలియోడోసిస్' ఉన్నట్లు గుర్తించారు. ఈ రోగుల్లో ఒకరు మరణించారు. మరో ముగ్గురు కోలుకున్నారు'
- గ్రామంలో సేకరించిన మట్టి నమూనాల పరీక్షల ఫలితాలు ఇంకా అందాల్సి ఉంది.
- గ్రామంలో 7 శాతం మందికి మధుమేహం ఉంది. 6 శాతం మందికి కిడ్నీకి సంబంధించిన రీనల్ ఫంక్షన్ టెస్టు (ఆర్ఎఫ్‌టీ)లో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయి ఎక్కువగా ఉన్నాయి.
- 10 శాతం మందికి లివర్ ఫంక్షన్ టెస్టులో సమస్య ఉన్నట్లు తేలింది.
- లిపిడ్ ప్రొఫైల్ టెస్టులో (కొలెస్ట్రాల్) 59 శాతం మందిలో సమస్య ఉంది.
- తెల్ల రక్తకణాల పరీక్షలో 13 శాతం మందికి మోతాదుకు మించి సమస్య ఉంది.
- 14 శాతం మందిలో ఏదో ఒక ఇన్‌ఫెక్షన్ (లింఫోసైటిస్) ఉన్నట్లు నిర్ధారణ జరిగింది.
- 22 శాతం మందిలో ఎర్ర రక్తకణాల(ఆర్‌బీసి) సమస్య ఉంది.
- 48 శాతం మందిలో రక్తహీనత(ఎనీమియా) సమస్య ఉంది. వీరిలో 66 శాతం మంది మహిళలు ఉన్నారు.

ఏడు రోజుల్లో.. జ్యోతిర్లింగ సహిత దక్షిణ యాత్ర

- 23న సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలు

హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఈ నెల 23న జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ్ యాత్ర భారత్ గౌరవ్ ప్రత్యేక టూరిస్టు రైలు బయలు దేరనుంది. వారం రోజుల్లో తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరులోని ఆలయాలను దర్శించుకునేందుకు వీలుగా తీర్థ యాత్ర ప్యాకేజీని ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) రూపొందించింది. సికింద్రాబాద్ నుంచి బయలుదేరే జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ్ యాత్ర ప్రత్యేక భారత్ గౌరవ్ టూరిస్టు రైలు విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. తీర్థయాత్రకు వెళ్లే ప్రయాణికులకు ఇతర రవాణా సౌకర్యంతో పాటు ప్యాకేజీలోనే క్యాటరింగ్ (ఉదయం టీ, అల్పాహారం, లంచ్-డిన్నర్) ఏర్పాట్లు చేసినట్టు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. ప్యాకేజీ ధర (ఒక్కొక్కరికి) ఎకానమీ రూ.14,100, స్లీపర్ 3 ఏసీ రూ.22,500, కంఫర్ట్ 2ఏసీలో రూ.29,500గా ఖరారు చేసినట్టు వివరించారు. మరిన్ని వివరాలు, బుకింగ్ కోసం 97013 60701, 92810 30726, 92810 30740, 92814 95845 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మలుపులు..ప్రమాదానికి పిలుపులు

- కానరాని హెచ్చరిక బోర్డులు ● వాహనదారులకు తప్పని ప్రమాదాలు

పెదకూరపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. మండలంలోని బుచ్చయ్యపాలెం గ్రామం నుంచి హౌస్సేన్ నగరం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో ప్రమాదకరమైన మలుపు ఉంది. పరస గ్రామం నుంచి కంభంపాడు వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డులో ప్రమాదకరమైన మూలమలుపు ఉన్నాయి. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన అంటున్నారు. ముఖ్యంగా 75 తాళ్లూరు, కాశిపాడు,పరస, అబ్బరాజుపాలెం గ్రామాల ప్రజలు.. కంభంపాడు గ్రామాల మీదగా గుంటూరు, 14 మైలు, తాడికొండ గ్రామాల వైపు నిత్యం అధిక సంఖ్యలో వాహనాలపై వెళ్తుంటారు. ఆర్టీసీ బస్సులు కూడా ఈ రూట్లో ప్రయాణిస్తూ ఉంటాయి. మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన హెచ్చరిక బోర్డులు కానీ వేగ నిరోధకాలు కానీ లేవు. రహదారి వెంబడి విద్యుత్ దీపాలు కూడా లేకపోవడంతో రాత్రులు అంధకారం కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. బుచ్చయ్యపాలెం, పరస గ్రామాల మూల ములపుల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేసి.. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బుచ్చయ్యపాలెం - హౌస్సేన్ నగరం మార్గంలోని మూల మలుపు



పరస - అమరావతి మార్గంలో మూల మలుపు

6 క్రస్ట్ గేట్ల ద్వారా నాగార్జున సాగర్ నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటి మట్టం శుక్రవారం నాటికి 589.90 అడుగులు ఉంది. ఇది 311.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేలు, ఎడమ కాలువ ద్వారా 6,325 , ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,414, 6 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 48,540 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 1,00,979 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 1,00,979 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



6 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ప్రకాశం బ్యారేజి దిగువకు 55,400 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు ప్రధాన వాగుల నుంచి 68,786 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా దిగువకు 53,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాల్వకు 8,864, పశ్చిమ డెల్టాకు 6,522 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు. గుంటూరు చానల్‌కు నీటి విడుదలను నిలిపివేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 43.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 68,250 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మూడు గేట్లను ఎత్తి 72,236 క్యూసెక్కుల నీరు, మొత్తం 89,236 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

1.0658 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జు సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 7 గేట్లను 2 మీటర్లు, ఒక గేట్ మీటర్ మేర ఎత్తి 73, 842 క్యూసెక్కులు, టేల్‌రేస్ చానల్ ద్వారా 8,476 మొత్తంగా 82,318 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. గురువారం అర్ధరాత్రి వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0658 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి జరిగిందన్నారు. రిజర్వాయర్‌లో 75.50(పూర్తిస్థాయి) మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080(పూర్తి స్థాయి) టీఎంసీలకు సమానమన్నారు.సాగర్ నుంచి 82 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని రెండు సబ్‌స్టేషన్లలో నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

నేడు ముప్పవరం, పంగులూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం, పంగులూరు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ముప్పవరం పరిధిలో ఉదయం 9 నుంచి 12గంటల వరకు అలవలపాడు, రేణంగివరం, కశ్యాపురం, జాగర్లమూడివారిపాలెం, ధైటమంజులూరు, భగవాన్‌రాజుపాలెం, కొండమూరు గ్రామాలకు సరఫరా నిలిపవేస్తున్నట్లు వివరించారు. పంగులూరు పరిదిలో చెట్లకొమ్మలు తొలగించేందుకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు గ్రామపరిధిలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి ఘన సన్మానం

హాజరైన మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

సంతమాగులూరు సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మక్కనవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పనిచేస్తున్న పీఎస్ ఉపాధ్యాయురాలు కొల్లి మోహన అంజలి శుక్రవారం ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఇలాంటి అవార్డు రాష్ట్రస్థాయిలో అందుకోవటం సంతోషకరంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఖాశిం, అవార్డు గ్రహీత భర్త శ్రీనివాసరావు, మాజీ హెచ్ఎం జాస్తి నారాయణరావు, లక్ష్మీనరేంద్ర కుమార్, హిందీ టీచర్ నాసరవల్లి, సీనియర్ అసిస్టెంట్ రంగారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి 250 కేజీల బియ్యం పంపిణీ

పర్చూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని ఆశ్రమ వృద్ధాశ్రమానికి దివంగత తులాబంధుల అర్జునయ్య, అనసూయమ్మల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.15వేల విలువ చేసే 250 కేజీల బియ్యాన్ని నిత్యావసర వస్తువల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు మాతృ వియోగం

సంతాపం తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షంషుద్దీన్ మాతృమూర్తి షేక్ రెహాన్‌బి శుక్రవారం మృతి చెందారు. మృతి చెందిన వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి ఫోన్‌లో పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

కొత్త ఈపోస్ మిషన్ల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెల్లరేషన్ కార్డుదారులకు పటిష్టంగా రేషన్ పంపిణీ చేసేందుకు ప్రజా ప్రభుత్వం కొత్తగా మంజూరుచేసిన ఈ పోస్ మిషన్లను డీలర్లకు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఒంగోలు పట్టణంలోని రేషన్‌షాపు డీలర్లకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ మిషన్ల పంపిణీని శుక్రవారం చేపట్టారు.

విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలి

దైవాలరావూరు జడ్పీ హైస్కూలులో సైన్స్‌ఫేర్‌లో కోమటి జయరాం

మేదరమెట్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, ఉపాధ్యాయులు ఆవిధంగా అవగాహన కల్పించాలని ఎన్ఆర్ఐ, తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం చెప్పారు. శుక్రవారం మండలంలోని దైవాలరావూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించన సైన్స్‌ఫేర్‌కు ముఖ్య అతిథులుగా ఎన్ఆర్ఐ, తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం, శాస్త్రవేత అందే మురళీకృష్ణ, బాపట్ల,



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న రాజశేఖర్, డిప్యూటీ డీఈవో గంగాధర్

ప్రకాశం జిల్లాల సైన్స్ అధికారులు సాదిక్, రమేష్, డిప్యూటి డీఈవో గంగాధర్ హాజరయ్యారు. మొత్తం 19 పాఠశాలల నుంచి 56 సైన్స్ ప్రయోగాలు వచ్చాయి. వక్తలు మాట్లాడుతూ సొంత గ్రామంలో విద్యార్థుల అభ్యున్నతికి 22 ఏళ్లగా పాటుపడుతున్న కందెపు రాజశేఖర్ అభినందనీయుడన్నారు. అన్ని విభాగాలల్లో ప్రతిభ చూపిన ఇంకొల్లు గరల్స్ హైస్కూల్ విద్యార్థి మోహన్ ప్రథమ స్థానంలో నిలిచారు. మొదటి ఐదు స్థానాల్లో బోదవాడ, నాగండ్ల, పంగులూరు, బోదవాడ, దేవరపాలెం హైస్కూల్స్, ద్వితీయ స్థానంలో మేదరమెట్ల హైస్కూల్, ఇంకోలు, అద్దంకి గరల్స్ హైస్కూల్స్, తిమ్మాయపాలెం, ఇంకొల్లు గరల్స్ హై స్కూల్ నిలిచాయి. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోనూరు సీతామహాలక్ష్మి, ఎంఈవో పున్నయ్య, పాఠశాల హెచ్ఎం కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పోతురాజు, హరిబాబు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి భూములను విడిపించాలి

అద్దంకి పట్టణంలో 1 నుంచి 7 వార్డుల పరిధిలోని స్థలాలు నిషేధిత జాబితాలోకి

నిలిచిన క్రయ, విక్రయాలు

వేరే సర్వే నెంబరుతో కమలేశ్వర మాన్యం భూమి రిజిస్ట్రేషన్లపై ఫిర్యాదు

మంత్రి రవికుమార్‌కు పలువురు వినతిపత్రాలు అందజేత

అద్దంకి,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని 7 వార్డుల పరిధిలో ఉన్న స్థలాల సర్వే నెంబర్లు నిషేధిత జాబితాలో చుక్కల భూమిగా, దేవదాయశాఖకు చెందినదిగా నమోదు కావటంతో క్రయ, విక్రయాలు నిలిచిపోయాయని పలువురు మంత్రి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని 1, 2, 3, 11, 12, 14, 15, 16 వార్డుల పరిధిలో ఉన్న 1038, 1096 సర్వే నెంబర్లలోని భూమి నిషేధిత జాబితాలో చేరటంతో క్రయ, విక్రయాలు నిలిచిపోయాయి. ఆయా ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో మున్సిపల్ కార్యాలయం వద్ద మంత్రి రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అదే సమయంలో కమలేశ్వరస్వామి మాన్యంలోని స్థలాలను పక్క సర్వే నెంబర్‌గా నమోదు చేసి అమ్మకాలు చేసి రిజిస్టర్ చేస్తున్నారని కూరపాటి వంశీ మంత్రికి ఫిర్యాదు చేశారు. ఆ అంశాన్ని పరిశీలించాలని తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రలను మంత్రి ఆదేశించారు. ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన పెంచాలని మున్సిపల్, మెప్మా అధికారులకు మంత్రి తెలిపారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు ఎన్ని ఏర్పాటు చేశారనే


భూముల సమస్యపై అర్జీ ఇస్తున్న కౌన్సిలర్‌లు, నేతలు

విషయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వల నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. పలువురు పింఛన్లు, ఇతర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు రావటంతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

218 మందికి రూ.1.83 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి రవి

అద్దంకి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. నియోజకవర్గంలోని 218 మందికి 1,83,43,916 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఐదుగురికి రూ.9 లక్షల విలువైన ఎల్ఓసీ పత్రాలను శుక్రవారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ప్రవేశ పెడుతున్న కొత్త హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ విధానం రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా నిలిచి పోతుందన్నారు. రాష్ట్రంలోని ఎక్కువ మంది పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలను అందించాలన్న లక్ష్యంతో కొత్త పాలసీని ప్రభుత్వం తీసుకువస్తుందని చెప్పారు.

గత వైసీపీ ప్రభుత్వ అరాచకాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమైనా ప్రజాసంక్షేమం కోసమే సూపర్‌సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలు అమలు చేస్తున్నామన్నారు.

నిధులకు భరోసా..

పనుల పూర్తికి స్పష్టమైన ఆదేశం

వెలిగొండపై సమీక్షలో సీఎం హామీ


హామీ ప్రకారం తొలిదశ పూర్తికి చర్యలు

రూ.2,059 కోట్లు అవసరంగా అధికారులు ప్రతిపాదన

వెంటనే అంగీకరించిన ముఖ్యమంత్రి

ఆర్థికశాఖలో పెండింగ్ ఉన్న రూ.456 కోట్లు

తక్షణం క్లియరెన్స్‌కు ఆదేశం


వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్ ప్రాంతం

పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల వాంచ అయిన వెలిగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. తాజాగా రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై నిర్దిష్ట చర్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇచ్చారు. తాను పశ్చిమ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఎట్టిపరిస్థితుల్లో వచ్చే ఏడాది జూన్‌కు తొలిదశ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి నీరు ఇవ్వాల్సిందేనని గురువారం జరిగిన పెండింగ్ ప్రాజెక్టుల సమీక్షలో స్పష్టం చేశారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేసమయంలో ఆ లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి, పునరావాస చర్యలకు నిధులపై అధికారులకు భరోసా ఇచ్చారు

ఒంగోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాజా అంచనాల ప్రకారం వెలిగొండ ప్రాజెక్టు వ్యయ అంచనా సుమారు రూ.10వేల కోట్లకు చేరుతుండగా అందుకనుగుణంగా ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలోని పశ్చిమ ప్రాంతంపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఫోకస్ చేశారు. అందులోభాగంగా ఆ ప్రాంతానికి అత్యంత కీలకమైన వెలిగొండ పూర్తిపై పలు సందర్భాలలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టు పూర్తికి భరోసా ఇస్తున్న సీఎం అందుకు అవసరమైన చర్యలపై సంబంధిత అధికారులకు విస్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు ఇతర సందర్భాలలోనూ 2026 జూన్ నాటికి వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తిచేసి నీరివ్వనున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి ఆ మాటకు కట్టుబడి ఉన్నానని తదనుగుణంగా పనులు పూర్తి చేయాల్సిందేనని మరోసారి ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు.

తక్షణం రూ.2వేల కోట్లు కావాలి

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ప్రాజెక్టు పనులపై గురువారం సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష చేశారు. అందులో వెలిగొండ ప్రాజెక్టుపై సవివరంగా సమీక్ష చేశారు. రాష్ట్ర స్థాయి జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో పాటు ఇక్కడి నుంచి ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్, ఎస్ఈ అబూత్ ఆలీంలు పాల్గొన్నారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు సుమారు రూ.6వేల కోట్ల వరకు వ్యయం కాగా టన్నెళ్ళ తవ్వకాలు, డ్యామ్‌ల నిర్మాణాలు, ప్రధాన కాలువల తవ్వకాలు, హెడ్ రెగ్యులేటరీ నిర్మాణం తదితర అనేక పనులు జరిగాయి. కాగా సీఎం ఆదేశాల ప్రకారం వచ్చే జూన్‌కు తొలిదశ పనులు పూర్తిచేసి లక్షా 19వేల ఎకరాలకు సాగునీరు, 8లక్షల మందికి తాగునీరు ఇవ్వాలంటే సుమారు రూ.2,059 కోట్లు నిధులు అవసరంగా ఆ సమీక్షలో అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఆర్థిక శాఖ అనుమతులు పెండింగ్

వెలిగొండ ప్రాజెక్టులో ప్యాకేజీ-2లో పెండింగ్ ఉన్న తీగలేరుపై 26 స్ట్రక్టర్లు, ఫీడర్ కాలువలపై స్ట్రక్టర్లు అలాగే 62 వేల ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా డిస్ట్రిబ్యూషన్ కాలువల పనులకు రూ. 247 కోట్లు ప్యాకేజీ-4లో భాగంగా తూర్పు ప్రధాన కాలువ, 40 స్ట్రక్టర్ల నిర్మాణాలు, 600 మీటర్ల లైనింగ్ ఇతర పనులకు రూ.184 కోట్లు, ప్యాకేజీ 5లో భాగంగా రెండవ టన్నెల్‌లో లైనింగ్ పనులకు రూ.142 కోట్లు, డైవర్షన్ రోడ్డుకు రూ.29 కోట్లు, ఫీడర్ కాలువ లైనింగ్, రిటైన్ వాల్ నిర్మాణాల కోసం రూ.456 కోట్లు, పునరావాస చర్యలకు రూ.1,002 కోట్లు అవసరంగా అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అందులో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు సంబంధించి రూ.456 కోట్లు పనులకు ఆర్థికశాఖ నుంచి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

సీఎంవో అధికారులకు ఆదేశాలు

ఆయా ప్యాకేజీల వారీగా నిధులు ఇచ్చేందుకు సమీక్షా సమావేశంలో అధికారులకు సీఎం చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న అనుమతులు తక్షణం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎంవో అధికారులను ఆదేశించిన ఆయన పునరావాస చర్యలకు అవసరమైన నిధులను తాను చూసుకుంటానన్నారు. మిగిలిన పనులకు సంబంధించి ఉన్నత స్థాయి అధికారులు అవసరానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ రకంగా నిధుల విషయంలో అదికారులకు భరోసా ఇచ్చిన సీఎం ఎట్టి పరిస్థితుల్లో తాను ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం వచ్చే జూన్‌కు తొలిదశ పనులు పూర్తిచేసి ప్రాజెక్టుకు నీరు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. మొత్తం మీద ప్రభుత్వ చర్యలు, సీఎం ఆదేశాలు వెలిగొండపై ఆశాజనక పరిస్థితిని సూచిస్తున్నాయి.

అవీఇవీ

గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జ్యోతి


నాయకులు, కార్యకర్తలతో ఇన్‌చార్జి నల్లగొర్ల శివశ్రీలక్ష్మీజ్యోతి

పర్చూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న గ్రామ పంచాయితీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నల్లగొర్ల శివశ్రీలక్ష్మీ జ్యోతి చెప్పారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు పోతిన సంపత్, పులిపాటి రవి, నల్లగొర్ల రామరాజుయాదవ్, మొహిద్దీన్‌బాషా, యూసఫ్, పేరిరెడ్డి ఆనందరావు, పౌలు, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడల పోటీలు


హైజంప్‌లో పాల్గొన్న విద్యార్థి

కారంచేడు/పర్చూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. రెండు రోజుల నుంచి వాలీబాల్, కబడ్డీ, కోకో, హైజంప్, లాంగ్ జంప్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆయా పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పోటీల్లో తలపడ్డారు. మండల స్థాయి పోటీలు సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కంటైనర్, లారీ ఢీ.. నిలిచిన ట్రాఫిక్


భవానీసెంటర్‌లో నిలిచిన ట్రాఫిక్

అద్దంకి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారీ కంటైనర్ మలుపు తిరిగే సమయంలో ఎదురుగా వచ్చే లారీని ఢీకొనటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న భారీ కంటైనర్ శుక్రవారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో మలుపు తిరిగే సమయంలో ఎదురువచ్చే లారీని పైభాగంలో ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు నామ్ రోడ్డుపై నిలపడంతో రెండు వైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

నేడు కొత్త కలెక్టర్ బాధ్యతలు స్వీకరణ

స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రాధాన్యతలు ఉంటాయని వెల్లడి

15, 16 తేదీల్లో కలెక్టర్ల సదస్సుకు హాజరు


రాజాబాబు

ఒంగోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 39వ కలెక్టర్‌గా నియమితులైన రాజాబాబు శనివారం ఆ బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుం ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్రటరిగా పనిచేస్తున్న ఆయనను ఇక్కడ కలెక్టర్‌గా నియమిస్తూ గత రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తం 12 జిల్లాల కలెక్టర్ల నియామకం చేసిన ప్రభుత్వం ఈ నెల 15, 16తేదీల్లో రాష్ట్ర స్థాయి కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తున్న నేపథ్యంలో తక్షణం విధులలో చేరాలని ఆదేశించింది. దీంతో ఎక్కువ మంది శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే జిల్లాకు కలెక్టర్‌గా నియమితులైన రాజాబాబు శనివారం ఉదయం 11 గంటలకు ఇక్కడి ప్రకాశం భవనంలోని కలెక్టర్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం జిల్లా కీలక అధికారులతో ఈనెల 15, 16 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కలెక్టర్ల సదస్సు అజెండా అంశాలపై సమీక్ష చేయనున్నట్లు సమాచారం. ఇదిలాఉండగా విధి నిర్వహణలో తన ప్రాధాన్యతలు ఉంటాయని రాజాబాబు చెప్పారు. ఇక్కడి ఆంధ్రజ్యోతి ప్రతినిధితో శుక్రవారం ఆ యన ఫోన్‌లో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ సర్వీసులో వివిధ హో దాల్లో పనిచేసిన తనకు జిల్లా గురించి కూడా సాధారణ అవగాహన ఉందన్నారు. బాధ్యతలు స్వీకరించాక అక్కడి పరిస్థితులు, ప్రజల అవసరాలు పరిశీలించి ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా దృష్టిసారిస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు సంబంధిత వర్గాలకు పారదర్శకంగా, త్వరితగతిన అందేలా చర్యలు తీసుంటామని తద్వారా ప్రభుత్వ ఆలోచనలు, లక్ష్యాలకు అనుగుణంగా వారి జీవన ప్రమాణాలు పెంపు లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కాగా ఇక్కడి నుంచి గుంటూరు జిల్లాకు బదిలీ అయిన కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం గుంటూరులో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

మొక్కుబడిగానే..

సాదాసీదాగా సాగిన జడ్పీ సమావేశం

లెక్కకు ఏడు అంశాలపై చర్చ నామమాత్రమే

హాజరు కాని టీడీపీ ప్రజాప్రతినిధులు, కలెక్టర్

అలాగే నెల్లూరు, బాపట్ల అధికారులు కూడా..

కేవలం పింఛన్ల మీదనే కొంతసేపు చర్చ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11.10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటలకు ముగిసింది. ఈ సమావేశపు అజెండాలో ప్రధానమైన అంశాలు ఉన్నా ఆయా అంశాలపై సుదీర్ఘంగా చర్చించి ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా సమావేశానికి వచ్చామంటే వచ్చామన్నట్లుగా ఏదో కొంత మంది సభ్యులు మొక్కుబడిగా మాట్లాడారే తప్ప క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి సమాధానాలు రాబట్టాల్సి ఉన్నా అందుకు భిన్నంగా జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన అధికార పార్టీకి చెందిన మంత్రులు, శాసనసభ్యులు హాజరు కావాల్సి ఉన్నా హాజరు కాలేదు. సమావేశానికి రాష్ట్రమంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామితో పాటు ఆ పార్టీకి చెందిన ముఖ్యమైన ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. కేవలం దర్శి, వైపాలెం ఎమ్మెల్యేలు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్ తప్ప వైసీపీకి చెందిన శాసనమండలి సభ్యులు కూడా హాజరుకాని పరిస్థితి ఏర్పడింది. మరో వైపు ఈ సమావేశానికి ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన ఉన్నతాధికారులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. కేవలం ప్రకాశం జిల్లాకు చెందిన జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు, బాపట్ల జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ మాత్రమే హాజరు కాగా నెల్లూరు జిల్లా నుంచి జిల్లా స్థాయి అధికారి పాల్గొన లేదు.

నామమాత్రంగా చర్చ

ఇక చర్చ సందర్భంగా మొదటగా పంచాయతీ రాజ్‌కు సంబంధించిన చర్చ జరిగినా కేవలం పది నిమిషాల్లోనే ఆ సబ్జెక్టు ముగిసింది. అనంతరం డీఆర్‌డీఏపై చర్చ జరగ్గా ఎమ్మెల్యేలు శివప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్‌తో పాటు పలు మండలాలకు చెందిన జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు మాట్లాడారు. ఏ ప్రాతిపదికన దివ్యాంగ పింఛన్లను తొలగిస్తా

కష్టకాలంలో ఉన్న ప్రజా సమస్యలపై చర్చించి ప్రభుత్వంతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళాల్సిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశాన్ని వేదికగా చేసుకొని ఆయా సమస్యలపై విస్తృతంగా చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఏదో నిర్వహించామంటే నిర్వహించామన్న రీతిలో తూతూమంత్రంగా ముగించారు. అధికార పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధులతో పాటు ఉన్నతాధికారులు రాలేదు. అలాగే నెల్లూరు, బాపట్ల జిల్లాల అధికారులు నామమాత్రంగా హాజరయ్యారు. అజెండాలో పదికిపైగా అంశాలు పెట్టిన కేవలం రెండు మూడు శాఖలపైనే చర్చ సాగింది. కేవలం పింఛన్లపైనే వైసీపీ ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు కాసేపు హడావుడి చేసి కేవలం మూడు గంటల్లోనే సమావేశాన్ని మమఅనిపించారు.

రని ప్రశ్నించడమే తప్ప పూర్తిస్థాయిలో సమగ్రంగా చర్చించిన పరిస్థితి లేకుండాపోయింది. ఇలా వైద్యశాఖ, విద్యుత్‌శాఖ, వ్యవసాయ, అనుబంధ శాఖలు, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖలపై చర్చ జరిగినా నామమాత్రంగానే జరిగింది. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు హాజరు కాకపోవడం వల్లనే ఆయా సమస్యలపై చర్చ జరగలేదనేది స్పష్టమైంది. గతంలో జరిగిన జడ్పీ సమావేశంలో ఇరువురు రాష్ట్రమంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామిలు పాల్గొని అటు సభ్యులు అడిగిన ప్రశ్నలతోపాటు వారి దృష్టికి వచ్చిన ఆయా సమస్యలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. కానీ ఈసారి ఏదో జడ్పీ సమావేశం సాదాసీదాగా ముగిసింది.

ఏ ప్రాతిపదికన తొలగిస్తారు

జిల్లాలో దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై పలు ప్రాంతాలకు చెందిన సభ్యులు ఏకరువు పెట్టారు. థర్డ్ పార్టీతో విచారణ చేయించి ఏ విధంగా పింఛన్లను తొలగించేందుకు నోటీసులు ఇస్తారని ప్రశ్నించారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో 3వేల మంది పింఛన్లను ఏ ప్రాతిపదికన తొలగించారని ప్రశ్నించారు. ఒకసారి సదరం సర్టిఫికెట్ తీసుకున్న తర్వాత థర్డ్ పార్టీతో విచారణ చేయించి తక్కువశాతం ఉందని ఏ విధంగా నిర్ధారించారని ప్రశ్నించారు. ఈ విధంగా పింఛన్లు తొలగించడం సరికాదన్నారు. మరో వైపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా ఎంతమందికి పింఛన్లు ఇచ్చారని ప్రశ్నించారు. దర్శి నియోజకవర్గంలో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, పక్కన డీఆర్వో ఓబులేషు, జడ్పీ సీఈవో చిరంజీవి

చెల్లించినా ఇంతవరకు వాటిని బిగించిన పరిస్థితి లేదన్నారు. వెంటనే వాటిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దివ్యాంగ పింఛన్లపై ధర్నా చేస్తాం

వైపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో 2,896 మంది పింఛన్లు తొలగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. వారందరికి న్యాయం చేయకపోతే వారితో కలిసి ధర్నా చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కనీసం సమావేశంలో ఆయా అంశాలపై సమాధానం చెప్పేందుకు మంత్రులు రాకపోవడం దారుణంగా ఉందన్నారు.

రైతులను ఆదుకోవాలి

జడ్పీటీసీ, ఎంపీపీలు తిరుపతిరెడ్డి, జీ.లక్ష్మీ, వేమా శ్రీనివాసరావులతో పాటు పలువురు మాట్లాడారు. రైతులు కష్టకాలంలో ఉన్నందున వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు సక్రమంగా ఎరువులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలా కొంతమంది సభ్యులు మాత్రమే ఒకటి ఆరా ఆ ప్రాంతాలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించారనే తప్ప పూర్తిస్థాయిలో ప్రజా సమస్యలపై అధికారుల దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడిన పరిస్థితి లేకుండాపోయింది. ఆయా అంశాల సమయంలో సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో సీఈవో చిరంజీవితోపాటు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ సెకండ్ ఇయర్ విద్యార్థి మృతి


విజయబాబు మృతదేహం

సంతమాగులూరు సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏల్చూరు ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు పల్లె పోగు విజయ్‌బాబు(19) శుక్రవారం సాయంత్రం లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అందిన వివరాల ప్రకారం... పల్లెపోగు విజయ్‌బాబు నర్సరావుపేటలోని నందమూరి బసవ తారక రామారావు డిగ్రీ కళాశాలలో బీకాం సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. రోజూ ఏల్చూరు గ్రామం నుంచి బస్సు పాస్‌తో నరసరావుపేట చేరుకొని కాలేజీకి వెళ్లేవాడు. మోటార్ సైకిల్‌పై కాలేజీకి వెళ్లి తిరుగు ప్రయాణంలో పల్నాడు జిల్లా, ఉప్పలపాడు వద్ద లారీని తప్పించబోయి ఢీకొట్టాడు. విజయ్ బాబు తండ్రి ఆశీర్వాదం చెన్నైలో బేల్దారీ పనులకెళ్లారు. విజయ్‌బాబు ఏల్చూరులో నాయనమ్మ దగ్గర ఉంటూ కాలేజీకి వెళుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో ఏల్చూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ఈపూరుపాలెం(చీరాల), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. మండల పరిధిలోని ఆంధ్రకేసరినగర్‌కు చెందిన సుపాదం, శిరీష దంపతులు శుక్రవారం ఉదయం స్కూటీపై చీరాల వెళుతుండగా ముందు వెళుతున్న విజయవాడకు చెందిన కారు అకస్మాత్తుగా బ్రేక్ వేశారు. ఈక్రమంలో వెనుక వస్తున్న స్కూటీ వేగంగా కారును ఢీకొనడంతో దంపతులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

10 గొర్రెలను ఎత్తుకెళ్లిన ఆగంతుకులు

మార్టూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో మార్టూరు రెవెన్యూ పరిధిలో గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో పొలాల్లో నిద్రిస్తున్న గొర్రెల మంద నుంచి 10 జీవాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీనిపై గొర్రెల యజమాని మంచాల సుబ్బారావు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్టూరు గ్రామానికి చెందిన మంచాల సుబ్బారావు పొలంలో దాదాపుగా 70 గొర్రెలను మేపుకుంటున్నారు. అదేవిధంగా గురువారం రాత్రి కూడా గొర్రెల మంద పొలంలోనే ఉంది అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెల మంద దగ్గరకు వచ్చి సుబ్బారావును బెదిరించి 10 గొర్రెలను వెంట తీసుకువచ్చిన వాహనంలో తీసుకువెళ్లారు. హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

పర్చూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కోర్టు భవనాల సముదాయంలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి కెప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, వివాహ సంబంధ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రెండు బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

16, 17 తేదీలలో మండల స్థాయి ఆటల పోటీలు

సంతమాగులూరు సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చవిటిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 16, 17వ తేదీలలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ద్వారా బాలబాలికలకు అండర్ 14, 17 విభాగాలలో ఆటల పోటీలు జరుగుతాయని ప్రధానోపాధ్యాయులు డేవిడ్, స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ పేరం శ్రీనివాసరావు తెలిపారు. పోటీలకు ముందుగా పరుగు పందాలు నిర్వహిస్తామన్నారు. కోకో, కబడీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా మొదలగు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనాలని కోరారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

చినగంజాం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన ఖాజీపాలెం కేవీఆర్ అండ్ ఎంకే ఆర్ డిగ్రీ కాళాశాల ఆవరణలో అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు నిర్వహించి, క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భోగిరెడ్డి స్వామిరెడ్డి, మారుబోయిన వెంకటరెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 8గంటలలోపు క్రీడాకారులు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 8247318995, 9542354041, 7416825797 సెల్ నెంబర్లను సంప్రదించాలని వెంకటరెడ్డి తెలిపారు.

జనవరిలోగా విద్యార్థులందరికీ సైకిళ్లు

మంత్రి గొట్టిపాటి


బాలికలకు సైకిళ్లు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులందరికీ జనవరిలోగా ఉచితంగా సైకిళ్లు అందజేస్తామని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. మండలంలోని బూదవాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 191 మంది బాల, బాలికలతోపాటు ప్లస్ 2 విద్యార్థులు 19మందికి మంత్రి రవికుమార్ సైకిళ్లను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం రఘురామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ మేఘా సంస్థ, మోర్ ఫౌండేషన్ సమకూర్చిన సీఎస్‌ఆర్ నిధులతో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాం, పుస్తకాలు, భోజన నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

11 పాఠశాలలకు సైకిళ్లు పంపిణీ

నియోజకరవర్గంలో ఇప్పటివరకు 11 పాఠశాలల విద్యార్థులకు సైకిళ్లు అందజేశామని మంత్రి చెప్పారు. త్వరలో కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్ విష్ణుప్రియ, ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, ఎంఈవో వీరాంజనేయులు, ఏఈ హనుమంతరావు, సుమంత్, మండల టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాయకులు కె.వి.సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, నార్నె సుబ్బారావు, ఓబుల్‌రెడ్డి, ఆదిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు అంజిరెడ్డి, బ్రహ్మానందస్వామి, సింగరకొండ, గొల్లపూడి అంజయ్య, చిలుకూరి కోటయ్య, అజిత్‌ట్రస్ట్ ఛైర్మన్ వీరనారాయణ పాల్గొన్నారు.

వీధిదీపాలు వెంటనే ఏర్పాటు చేయండి : మంత్రి ఆదేశం

మండలంలోని బూదవాడలోని ధన లక్ష్మీ కాలనీ నుంచి గ్రామంలోకి వచ్చే రహదారిలో వీధిదీపాలు తక్షణమే ఏర్పాటుచేయాలని డిప్యూటీ ఎంపీడీవో సుమంత్‌ను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. బూదవాడ వచ్చిన మంత్రికి గ్రామస్థులు, రైతులు తమ సమస్యలను వివరించారు. అలాగే గ్రామపొలాలకు వెళ్లే డొంకరహదారుల అభివృద్ధికి చర్యలు చేపడతామని రైతులకు హామీ ఇచ్చారు. ఈనెల 5నుంచి 7వ తేదీవరకు ద్వారకాతిరుమలలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థినులు లిఖిత, శ్రుతిని మంత్రి గొట్టిపాటి అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు.

సొసైటీలకు ఎరువులు కొరత లేకుండా అందించాలి

రైతుకు అవసరమైన ఎరువులు కొరత లేకుండా అందేలా చర్యలు చేపట్టాలని మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. సొసైటీలకు యూరియా, డీఏపీ లాంటి ఎరువులు పూర్తిగా అందజేయాలన్నారు. ఎరువులు బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం


పోటీలకు హాజరైన విద్యార్థులు

చినగంజాం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : క్రీడలతో శారీరక వికాసంతో పాటు, మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని నియోజకవర్గ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ గుంటా అంకమ్మ చెప్పారు. స్థానిక లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బాలబాలికలకు శుక్రవారం మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మ మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. అండర్-14, 17 విభాగాలలో బాలురకు రన్నింగ్, హైజంప్, షాట్‌పుట్, జావిలన్‌త్రో, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్ల రన్నింగ్ పోటీలు బాలికలకు 600 మీటర్లు, మూడు కిలోమీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. గురు, శుక్రవారాల్లో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, జావిలన్‌త్రో, రన్నింగ్, హైజంప్, షాట్‌పుట్ తదితర పోటీలలో ప్రతిభ చాటిన బాలబాలికలు డివిజన్ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల పీడీలు ఎం.అప్పారావు, సీహెచ్ వెంకటసుబ్బారావు, ఎం.సురేష్‌బాబు, జి.కృష్ణారావు, ఎం.అనిల్, మల్లిక, పీఈటీలు వాణి, కోమలి, ఎస్ఎస్ఐ కోచ్ కుక్కల అనంతకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్రప్రదేశ్' డైరెక్టర్‌గా చిన్ని ప్రమాణ స్వీకారం

అద్దంకి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అద్దంకి పట్టణ టీడీపీ అధ్యక్షుడు, అద్దంకి మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును మంత్రి నారాయణ, ఇతర అతిథులు అభినందించారు. అద్దంకి నుంచి వెళ్లిన క్లస్టర్ ఇన్‌చార్జులు కుందారపు రామారావు, కాకాని అశోక్, శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య నాయకులు గార్లపాటి శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకర్, కురిచేటి వెంకటసుబ్బారావు, భోజనపల్లి సత్యనారాయణ, నూకల రామాంజనేయులు తదితరులు చిన్ని శ్రీనివాసరావును అభినందించారు.


చిన్ని లక్ష్మీశ్రీనివాసరావును అభినందిస్తున్న అద్దంకి పట్టణ నేతలు

గ్రామాలలో చేపట్టిన సర్వేలను సత్వరమే పూర్తిచేయాలి

పంగులూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ప్రభుత్వం నిర్దేశించిన సర్వే కార్యక్రమాలను సిబ్బంది సత్వరమే పూర్తిచేయాలని చీరాల డీఎల్‌డీవో పద్మావతి సూచించారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వామిత్వ, కౌశలం, ఇంటిపన్నులు, శానిటేషన్‌కు సంబంధించిన సర్వేల నిర్వహణపై అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. గ్రామ కంఠాలలో హక్కుదారులకు స్పష్టమైన హక్కుపత్రాలు జారీచేయడమే స్వామిత్వ సర్వేముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాలలో పూర్తి సమాచార సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వామిత్వ సర్వే చేపట్టాయని చెప్పారు. హక్కుదారులకు స్పష్టమైన హక్కుపత్రాలు అందచేయడం వలన క్రయవిక్రయాల సమస్యలు తొలగిపోతాయని, సంబంధిత పత్రాలతో బ్యాంక్ రుణాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. మండలంలోని 21 గ్రామ పంచాయితీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు 94లక్షల 40వేల947 రూపాయలు విడుదలైనట్లు చెప్పారు. అనంతరం గ్రామంలోని చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీవో స్వరూపారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.


పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న చీరాల డీఎల్‌డీవో పద్మావతి

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాలలో హిందీ భాష దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

బల్లికురవ, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 14న హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన హిందీ పదాలపై ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయురాలు షేక్ జుబేదాబేగం ఆధ్వర్యంలో హిందీ సబ్జెక్టుపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఇస్మాయల్ పాల్గొన్నారు.

పందిళ్లపల్లిలో...

పందిళ్లపల్లి(చీరాల), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా బొహార్ రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హిందీ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దీప్తి, ఉపాధ్యాయులు లలిత పరమేశ్వరీ, ఆంజనేయులు, మహశ్రీ, మాధురి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

తహసీల్దార్‌కు ఏపీటీఎఫ్ నేతల వినతిపత్రం

చీరాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) :ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు అందించాలని, ఎరియర్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ చీరాల ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, ఆలూరి శ్రీనివాసరావు, హరికిషన్, వెంకటేశ్వరరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

అద్దంకిలో...

అద్దంకిటౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణం విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.తహసీల్దార్ కార్యాలయం వద్ద టీచర్లు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రమేష్‌బాబు, రామయ్య, మల్లికార్జునావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, అంకయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవలో...

బల్లికురవ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు నల్లబ్యాడ్జీలు ధరించారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, అన్ని రకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, హెల్త్ కార్డుల పరిమితి రూ.25 లక్షలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రవినాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు పార్థసారథి, గోలి శ్రీనివాసరావు, ప్రశాంత్, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

పంగులూరులో...

పంగులూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పంగులూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమం అనంతరం ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చేజర్ల చెంచురామారావు, కార్యదర్శి కంకణాల శ్రీనివాసరావులు తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందజేశారు. నేతలు తన్నీరు వెంకటరావు, రహంతుల్లా, ప్రసాద్, నారాయణ, ఆర్.వి.సుబ్బారావు, అనిత,లలిత, అనిల్ కుమార్, నారాయణమ్మ పాల్గొన్నారు.

మార్టూరులో...

మార్టూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్టూరు తహసీల్దారు కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం చేశారు. అనంతరం తహసీల్దారు ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మాడుగుల కిషోర్,నాదెండ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

పోలీసులు మైత్రీభావంతో మెలగాలి

అవీఇవీ

బల్లికురవ పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

బల్లికురవ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ప్రజలతో పోలీసు సిబ్బంది మైత్రీభావంతో మెలిగి గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా చర్యలు చేపట్టాలని బాపట్ల డీఎస్పీ గోగినేని రామంజనేయులు చెప్పారు. శుక్రవారం బల్లికురవ పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ వార్షిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు, పెండింగ్‌లో ఉన్నవి, వాటి పురోగతిపై వివరాలను సేకరించారు. అనంతరం అయన మాట్లాడుతూ ఏమైనా సమస్యలపై వచ్చే వారి వివరాలను శ్రద్ధగా విని వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అలానే బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు చేపట్టాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహనదారులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సంతమాగులూరు సర్కిల్ సీఐ కాకుమాను వెంకట్రావు, ఎస్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

నేపాల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించడం హర్షణీయం

నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్


మాట్లాడుతున్న మహేంద్రనాథ్

చీరాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నేపాల్లో చిక్కుకున్న 215 మంది తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి చేర్చిన మంత్రి లోకేష్ సేవలు హర్షణీయమని నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ చెప్పారు. నేపాల్ ఘటనపై వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టిన లోకేష్ సేవలను కొనియాడుతూ మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావుతో సమావేశం నిర్వహించారు. థాంక్యూ లోకేష్ సార్ అంటూ నినదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందన్నారు. అంతకుముందు ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచిఅర్జీలు స్వీకరించారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో రమేష్

బల్లికురవ, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజూ ఏదో ఒక ఆట ఆడటం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంఈవో రమేష్‌బాబు చెప్పారు. శుక్రవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆటల పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎంఈవో రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అండర్ 14, 17 విభాగాలలో ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డివిజన్ స్థాయి పోటీలకు పంపుతున్నట్లు ఎంఈవో తెలిపారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహం

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో 9, 10 తరగతులు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పూరా మస్తాన్‌రావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ముఖ్య అతిథులుగా పర్చూరు ఎంఈవో డాక్టర్ శివ కోటేశ్వరరావు, బీబీహెచ్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ నాగమాంబ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సరోజని, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి డబ్బు ప్రతిబంధకం కాకూడదు

మేదరమెట్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : డబ్బులు లేక చదువుకోలేక పోయాను అని ఎవరూ బాధపడకూడదని విద్యార్థులకు అవసరమైన సాయం అందిస్తానని ఎస్‌ఆర్‌ఐ పూనాటి రవీంద్రబాబు చెప్పారు. శుక్రవారం రావినూతల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు గంటల పాటు విద్యార్థులతో ముఖముఖి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో తెలుగు మాధ్యమంలో చదువుకుని అంతర్జాతీయ సంస్థకు వైస్ ప్రెసిడెంట్ బాధ్యతల నిర్వహణ వరకు తన ప్రయాణంలో అనుభవాలను వివరించారు. గ్రామంలో 100కు పైగా పేద కుంటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించడం వెనుక ఉన్న ఉన్నత ఆశయాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన పది మంది ఆడపిల్లలను దత్తత తీసుకుని వారికి ఇంజనీరింగ్ పూర్తి అయ్యే వరకు స్పాన్సర్ చేయడానికి గల పేరణ గురించి ఆయన వివరించారు. తాటి సరోజిని ట్రస్ట్ తరఫున ఆంగ్లవ్యాకరణ పుస్తకాలను ఒంగోలులో ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ చాపల వంశీకృష్ణ పంపిన రాత పుస్తకాలను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బుజ్జి, మోపర్తి శేషారావు, మోపర్తి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పని అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇవ్వాలి

ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ

పర్చూరు, సెపెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పని అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇవ్వాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటస్వామి చెప్పారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రాంగణంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పని కావాలని అడిగిన వారికి జాబ్ కార్డు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఉపాధి పథకం కింద వందరోజులు పని కల్పించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, ఏపీవో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకట స్వామి